ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
బాపట్ల జిల్లా వార్తలు
5
మంగళవారం 11 మార్చి 2025


గుర్రపుడెక్క తూటుకాడ కమ్మేసిన ఆర్.ఎం డ్రెయిన్



కృష్ణాడెల్టాకు..

- కన్నీటి కష్టాలకు అడ్డుకట్ట వేసేందుకు కూటమి ప్రభుత్వం సంసిద్ధత
- డ్రెయిన్‌ల ఆధునికీకరణకు శ్రీకారం ఇప్పటికే రూ. 680 కోట్లతో ప్రతిపాదనలు
- ఒక్క నల్లమడ డ్రెయిన్‌కే రూ. 480 కోట్లు
- పశ్చిమ డెల్టా సాగునీటి కాల్వలకూ 2007 తర్వాత మళ్లీ ఆధునికీకరణ ఆలోచన
- రూ. 1500 కోట్లతో కొత్త ప్రతిపాదనలకు నీటిపారుదల శాఖ రంగంలోకి..

మళ్లీ మహర్దశ!

ఎటు చూసినా కట్టలు కుంగిపోయి గండ్లు పడుతూ... కాల్వలు, డ్రెయిన్‌లలో పూడిక పేరుకుపోయి చివరి భూములవరకు నీరు అందక... షట్టర్‌లు, తూములు దెబ్బతినిపోయి ప్రతి నీటి బొట్టు విలువైనదైన పరిస్థితుల్లో వృధాగా మురుగు కాల్వల్లో కలసిపోయి... వర్షం పడితే చుక్కనీరు కిందికి పోకుండా పొలాలను ముంచెత్తుతూ రైతులకు కడ'గండ్లే' మిగిలితే... ఎంత కష్టమో కదా!. ఒకటో, రెండో సీజన్‌లు కాదు... కొన్ని దశాబ్దాలుగా కృష్ణా డెల్టా పరిధిలోని వరి రైతులకు వీటి ఫలితంగా మిగులుతోంది కన్నీటి కష్టాలే. పంట వేసిన ప్రతి సంవత్సరం వర్షాలు పడకపోతే నీరందక పంటలెండి, వరుణుడు కరుణిస్తే డ్రెయిన్‌ల కట్టలు తెంచుకుని వరద నీరు పొలాలపైపడి పంట మొత్తాన్ని ముంచే స్తుంటే, ఆ దేవునిపై భారం వేయటం మినహా రైతులు చేయగలిగిందేమీ లేకుండాపోయింది. కృష్ణా డెల్టాలో సాగు నీటి కష్టాలు, డ్రెయిన్‌ల దుస్థితితో ఏర్పడుతున్న సమస్యలతో గత కొన్ని దశాబ్దాలుగా తీవ్ర నష్టాలను చవిచూస్తున్న రైతులకు కూటమి ప్రభుత్వం శుభ వార్త చెప్పింది. మళ్లీ డెల్టా కాల్వల ఆధునికీకరణకు శ్రీకారం చుడుతున్నట్టు తీపికబురు చెప్పటంతో రైతుల్లో సంతోషం కనిపిస్తోంది.

తెనాలి, మార్చి 10, (ఆంధ్రజ్యోతి): కృష్ణా పశ్చిమ డెల్టా పరిధిలో 5,71,351 ఎకరాలు సాగవుతుంటే, ఈ విస్తీర్ణం మొత్తం గుంటూరు, బాపట్ల, ప్రకాశం జిల్లా పరిధిలో ఉంది. ఒక సీజన్‌లో ఖరీఫ్ పంట సాగవ్వాలంటే 69 టీఎంసీల నీరు అవసరం అవుతుంది. అయితే ఈ నీరు అందించటానికి 8,200 క్యూసెక్కుల సామర్థ్యంతో ప్రకాశం బ్యారేజి దగ్గర నుంచి ప్రధాన కాల్వ వస్తున్నా, దాని నుంచి నీటిని పంట పొలాలకు అందించే కృష్ణా పశ్చిమ బ్యాంక్ కెనాల్, తూర్పు, పశ్చిమ, నిజాంపట్నం కాల్వలు, కొమ్మమూరు, హైలెవల్ ఛానల్స్ కీలకంగా ఉన్నాయి. అయితే వీటిపై ఎప్పుడో 2007లో డెల్టా కాల్వల ఆధునికీకరణ చేపడితే, అవి 2012 వరకు సాగుతూనే వచ్చాయి. వీటిలోనూ పూర్తిశాతం పనులు జరగలేదు. సాగునీటి కాల్వల పనుల్లో 50 నుంచి 60 శాతం మేర పనులు జరిగితే, డ్రెయినేజి పనులు మాత్రం 70 శాతం వరకు జరిగాయి. ప్రకాశం జిల్లా వరకు ఉన్న కొమ్మమూరు కాల్వపైన అయితే రూ. 408 కోట్ల ఆధునికీకరణ పనులు అసలు జరగనేలేదు. ఆ నిధులు రద్దయిపోవటంతో రైతులకు ఇబ్బందులు మరింత పెరిగిపోయాయి. అయితే తాజాగా నీటిపారుదల శాఖ డ్రెయినేజి పనులకు సంబంధించిన కొన్ని పనులకు ఇప్పటికే నాబార్డ్‌కు ప్రతి పాదనలు పంపితే, మరికొన్ని పనులకు సంబంధించి మరోసారి మరికొన్ని పనులకు సంబంధించిన ప్రతిపాదనలు పంపేందుకు సిద్ధమవుతోంది. ఇదిలా ఉంటే, డెల్టా కాల్వల ఆధునికీకరణ పనులకోసం మళ్లీ రంగం సిద్ధం చేస్తున్నామని, దీనికి సంబంధించిన పూర్తి వివరాలతో కూడిన ప్రతిపాదనలు పంపాలని నీటి పారుదల శాఖకు ఆదేశాలు కూడా అందాయి. అయితే వీటిని సిద్ధం చేయటానికి మాత్రం నీటిపారుదల శాఖకు మరో మూడు సీజన్‌ల కాలం పట్టే పరిస్థితి ఉంది.

డ్రెయిన్‌ల మరమ్మతుల కోసం రూ. 680 కోట్లతో ప్రతిపాదనలు

కృష్ణా పశ్చిమ డెల్టా పరిధిలోని డ్రెయిన్‌ల మరమ్మతులకోసం నీటిపారుదల శాఖ రూ. 680 కోట్లతో ప్రతిపాదనలను తాజాగా నాబార్డ్‌కు పంపింది. వీటిలో ఒక్క నల్లమడ వాగుకోసంమే రూ. 480కోట్ల ప్రతిపాదనలు పంపితే, మిగిలిన రూ. 200 కోట్లతో 60 కి.మీటర్ల పొడవున్న రేపల్లె మెయిన్ డ్రెయిన్, 51 కి.మీటర్ల పొడవున్న భట్టిప్రోలు మెయిన్ డ్రెయిన్‌ల, మరి కొన్ని చిన్న డ్రెయిన్‌ల మరమ్మతులు చేయాలని నిర్ణయించారు. వీటిలో రూ. 140 కోట్ల ప్రతిపాదనలు ఇప్పటికే నాబార్డ్‌కు చేరిపోతే, మిగిలిన ప్రతిపాదనలు పంపే పనిలో ఉన్నామని అధికారులు చెబుతున్నారు. ఆర్.ఎం డ్రెయిన్‌పై నిజాంపట్నం దగ్గరున్న పాలరేవు ఔట్‌ఫాల్ స్లూయిజ్ వెడల్పు పెంచే ప్రతిపాదనలు కూడా ఉన్నాయి. ఇక్కడ సముద్రం నీరు వెనక్కు రాకుండా ఆపేందుకు స్లూయిజ్ నిర్మించారు. అయితే దీనికి 10 ఖానాలు మాత్రమే ఉండటంతో సా వ ం ర్థ్యం సరిపోవటంలేదని, దానిని మరో 10 ఖానాలు పెంచి, మొత్తం 20 ఖానాలతో స్లూయిజ్‌ను వెడల్పు చేయాలని నిర్ణయించారు. ముంపునీరు త్వరగా సముద్రంలోకి వెళ్లటానికి ఇది ఉపయోగపడుతుంది. ఇవికాక మిగిలిన డ్రెయిన్‌ల కట్టలు బలపరచటం, డ్రెయిన్‌లలో ప్రధాన సమస్యగా ఉన్న పూడిక తీయటం, వంటి పనులు చేయాల్సి ఉంది.

నల్లమడకు మోక్షం లభించినట్టేనా!

నల్లమడ డ్రెయిన్ కిందున్న లక్ష ఎకరాల ముంపు సమస్యకు శాశ్వత

(మిగతా 6వ పేజీలో)


పి.వి.పాలెం దగ్గర సబ్ డెయిన్ షట్టర్ ధ్వంసమై కాంక్రీట్ దిమ్మెలు పగిలిపోయిన చిత్రం


బుర్రిపాలెం వద్ద డ్రెయిన్ అడ్డుగా ఉన్న తూములు

రంజాన్ వేళలు

ఇఫ్తార్ : 6.22 (మంగళవారం)
సహరి : 5.02 (బుధవారం)

ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నాం

కృష్ణా డెల్టా కాల్వల ఆధునికీకరణ పనులు చేపట్టటానికి అవసరమైన ప్రతిపాదనలు పంపాలని ప్రభుత్వం సూచించింది. వీటిని ఈ సీజన్ నుంచే మొదలు పెడుతున్నాం. అయితే డ్రెయిన్‌ల మరమ్మతులకు, ఆధునికీకరణ పనులకు సంబంధించి ఇప్పటికే ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపాం. సుమారు రూ. 680 కోట్ల వరకు ఖర్చవుతుందని ప్రతిపాదనల్లోకోరాం. ఇవికాక వచ్చే సీజన్‌లో చేయాల్సిన అత్యవసర మరమ్మతులకోసం ఓ అండ్ ఎం కింద రూ. 40 కోట్ల ప్రతిపాదనలు కూడా ఇప్పటికే పంపించేశాం. మరి కొద్ది రోజుల్లో నిధుల మంజూరు ఉత్తర్వులు రావచ్చు. వచ్చిన వెంటనే పనులకోసం టెండర్లు పిలుస్తాం.

- వెంకటరత్నం, నీటిపారుదల శాఖ ఎస్ఈ గుంటూరు.





- గుంటూరు (ఆంధ్రజ్యోతి)

గుంటూరు చుట్టుగుంట చెరువులో కనిపించే తెల్ల కొంగలు ఒక కొత్త అందాల లోకాన్ని తలపిస్తుంటాయి. చేపల వేటలో భాగంగా చెరువులో వాటి విన్యాసాలు కనువిందు చేస్తున్నాయి. మార్నింగ్ వాక్‌కు వచ్చే ప్రతి ఒక్కరూ ఈ తెల్ల బంగారు లోకం చూసి కొత్త అనుభూతికి లోనవుతుంటారు.

అక్రమార్కులకు అందలం

అటకెక్కిన రూ. 347 కోట్ల అవినీతి నివేదిక

- నెలలు దాటినా చర్యలు శూన్యం
- అక్రమాలకు పాల్పడిన వారికి అందలాలు
- మార్కెటింగ్ శాఖలో చిదంబర లీలలు

గత ప్రభుత్వ హయాంలో గుంటూరు మిర్చియార్డులో భారీ అవినీతి జరిగింది. అక్కడ జరిగిన అవినీతి, అక్రమాలపై అందిన ఫిర్యాదు మేరకు విజిలెన్స్ అధికారులు విచారణ జరిపి రూ.347 కోట్ల మేర అవినీతి జరిగిందని గత ఏడాది నవంబర్‌లో ప్రభుత్వానికి నివేదిక ఇచ్చారు. అప్పటి యార్డు ఛైర్మన్,మార్కెటింగ్ అధికారులు,ఉద్యోగుల పై చర్యలకు సిఫార్సు చేశారు. ఇదంతా గత ఏడాది డిసెంబర్ లో వెలుగులో కి వచ్చింది. అప్పట్లో సంచలనం సృష్టించిన ఈ వ్యవహారంలో ఇక ఏదో జరిగిపోతుందని అందరూ భావించారు. .కానీ అలా ఏమీ జరగలేదు. ఎవరిపైనా ఏ చర్య తీసుకోలేదు. పైగా విజిలెన్స్ నివేదిక వచ్చిన తరువాత కొందరికి కొత్తగా పోస్టింగ్‌లు ఇచ్చారు. మరికొందరిని ఉన్నత స్థానాల్లో కూర్చోబెట్టారు. టోటల్ గా చెప్పాలంటే మార్కెటింగ్ శాఖ ఉన్నతాధికారులు విజిలెన్స్ ఇచ్చిన నివేదికను,చేసిన సిఫార్సు లను అటకెక్కించారు.


గుంటూరు ప్రాంతీయ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ కార్యాలయం

గుంటూరు సిటీ, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): గడచిన ఐదేళ్లలో గుంటూరు మిర్చి యార్డు ను అవినీతి,అక్రమాలకు అడ్డాగా మార్చిన వారిపై మార్కెటింగ్ శాఖ ఉదాసీనత ప్రదర్శిస్తున్నదనే విమర్శలు ఉన్నాయి. వారి అక్రమాలపై విజిలెన్స్ నివేదిక వచ్చిన తరువాత కూడా చర్యలకు ఉపక్రమించకపోవటం పట్ల విమర్శలు వెల్లు వెత్తుతున్నాయి. గత ఏడాది నవంబర్‌లోనే విజిలెన్స్ అండ్, ఎన్‌ఫోర్స్‌మెంట్ నివేదికను ప్రభుత్వానికి సమర్పించింది. ఆ తర్వాత జరిగిన పరిణామాలు చూస్తుంటే విజిలెన్స్ నివేదికను మార్కెటింగ్ శాఖ పూర్తిగా పక్కన పెట్టేసినట్లు అర్థం అవుతున్నది. ఇందుకోసం ఉన్నత స్థాయి లాబీయింగ్ నడిచినట్లు ఆరోపణలు వస్తున్నాయి. యార్డులో జరిగిన అవినీతిలో మొత్తం 20 మంది పాత్ర పోషించినట్లు విజిలెన్స్ నిర్ధారించింది. ఆరోపణలు ఎదుర్కొంటున్న వారిలో మార్కెటింగ్ శాఖలోని ఉన్నతాధికారులు కూడా ఉన్నారు. పలువురు యార్డు సెక్రటరీలు, సూపర్ వైజర్లు ప్రధాన పాత్రధారులుగా ఉన్నట్లు తేల్చారు. వారి వల్లనే వివిధ రూపాల్లో యార్డుకు రావాల్సి న రూ.347 కోట్ల ఆదాయానికి గండి పడినట్లు నిర్ధారించారు. ఒక సెక్రటరీ లైసెన్స్ రెన్యువల్ వ్యవహారంలో పూర్తి స్థాయి గుత్తాధిపత్యం ప్రదర్శించినట్లు కూడా నివేదిక లో విజిలెన్స్ స్పష్టం చేసింది.

మెమో ఇంకా రాలేదా ..?

విజిలెన్స్ నివేదిక ప్రభుత్వానికి చేరిన తరువాత బాధ్యులైన అధికారులు, ఉద్యోగుల పై చర్యలు నిమిత్తం మెమో జారీచేస్తుంది. ఆ మెమో ఆధారంగా నే మార్కెటింగ్ శాఖ చర్యలకు ఉపక్రమించటం జరుగుతుంది. ప్రభుత్వానికి నివేదిక చేరిన అతి తక్కువ సమయంలోనే ఈ మెమో జారీ అవుతుంది. యార్డు వ్యవహారం మాత్రం అందుకు భిన్నంగా జరిగింది. నివేదిక వెళ్లిన నాలుగు నెలల తర్వాత కూడా ఏ విధమైన స్పందన కనపడటం లేదు.ప్రభుత్వం అసలు మెమోనే జారీ చేయలేదా. ఒక వేళ ప్రభుత్వం మెమో జారీచేసిన తర్వాత కూడా చర్యలకు మార్కెటింగ్ శాఖ మీనమేషాలు లెక్కిస్తుందా..? అన్న దానిపై చర్చ జరుగుతున్నది. గత ప్రభుత్వ హయాంలో యార్డు లో ఏకచత్రాధిపత్యం సాగించిన కొందరికి మంచి స్థానాల్లో పోస్టింగ్ ఇవ్వడం విమర్శలకు తావిస్తోంది. ఎవరిపై ఎన్ని ఫిర్యాదులు వచ్చినా ఏవిధమైన చర్యలు చేపట్టకుండా ఉండేందుకు వాళ్లే పావులు కదుపుతున్నారన్న ప్రచారం జరుగుతున్నది. విజిలెన్స్ నివేదికను అటక్కెకించటంలో కూడా వాళ్ల పాత్రే కీలకంగా ఉన్నట్లు సమాచారం. వేరే వ్యవహారంలో రూ. కోట్ల ముడుపులు ముట్టజెప్పినందుకు నజరానాగా ఈ వ్యవహారం పక్కన పెట్టమని కోరినట్లు ప్రచారం సాగుతోంది.

90,000 టన్నుల.. ధాన్యం సేకరణ

- ముగింపుకొచ్చిన కొనుగోళ్లు
- నేడు సమీక్ష... అధికారిక ప్రకటన

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

ఖరీఫ్‌లో మద్దతు దరకు ధాన్యం సేకరణ ముగింపు కొచ్చింది. జిల్లా వ్యాప్తంగా ఇప్పటి వరకు 90,000 టన్నుల ధాన్యాన్ని మద్దతు ధరకు అన్నదాతల నుంచి సేకరించినట్లు అధికారులు చెబుతున్నారు. ఈ సీజన్‌లో జరిపిన ధాన్యం కొనుగోళ్లపై సమీక్ష జరపడానికి వ్యవసాయశాఖతో పాటు సివిల్ సప్లయిస్ సంబంధిత విభాగాలు మంగళవారం సమావేశం కానున్నాయి. కొనుగోళ్లకు సంబంధించి చెల్లింపులు కూడా 48 గంటల్లోనే రైతుల ఖాతాల్లో జమ అయ్యే విధంగా ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంది. గత ఏడాది ఇదే సీజన్‌లో డబ్బులు జమ గురించే పెద్ద ఎత్తున ఫిర్యాదులు అధికారులకు అందేవి. కానీ ఇప్పటి వరకు ధాన్యం సొమ్ముల గురించి ఒక్క రైతు కూడా ఎలాంటి ఫిర్యాదు చేయకపోవడం ప్రభు త్వం సాధించిన ఘనతగా అధికారులు చెబు తున్నారు

ఐదు దఫాలుగా ప్రతిపాదనలు...

మద్దతు ధరకు ధాన్యం కొనుగోలు విషయంలో ఈ దఫా తీవ్రస్థాయిలో కసరత్తు చేయాల్సి వచ్చింది. ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి తొలుత ప్రభుత్వం ఇచ్చిన లక్ష్యం 50,000 టన్నులే కావడం, మరో వైపు కొనుగోలు కేంద్రాల వద్ద ధాన్యం రాశులు బారులు తీరడంతో లక్ష్యం కాస్తా నెల రోజులకే తరిగిపోయింది. ఇక అప్పటి నుంచి రాష్ట్రస్థాయిలో ఉన్న కమిషనర్‌కు జిల్లాలో ధాన్యం కొనుగోళ్లకు సంబంధించి మరింతగా అనుమతులు ఇవ్వాలన్న ప్రతిపాదనలను దశలవారీగా పంపడం, దాదాపుగా వాటిని సాధించుకోవడంలో యంత్రాంగం సఫలమైంది. స్థానిక పరిస్థితులు ఆధారంగా ఈ ప్రతిపాదనలను ఆమోదించుకోవడంలో నేతల కృషి తోడవడంతో రైతులకు మెరుగ్గా మద్దతుధర ప్రయోజనం అందడంలో విజయం సాధించారు. తొలుత ఇచ్చిన 50,000టన్నులకు తోడు దఫదఫాలుగా మరో 40,000 వరకు అనుమతులు తేగలిగారు. దీంతో ఇప్పటి వరకు రికార్డుస్థాయిలో 90,000 టన్నుల ధాన్యాన్ని ప్రభుత్వం సేకరించగలిగింది.


విద్యాశాఖ అధికారులతో మాట్లాడుతున్న మంత్రి గొట్టిపాటి

ఒక్క పాఠశాలా మూతపడకూడదు

- మంత్రి గొట్టిపాటి రవికుమార్

అద్దంకి, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : పాఠశాలల పునరుద్ధరీకరణ సమయంలో కచ్చితంగా విద్యార్థుల తల్లిదండ్రులు, పాఠశాల మేనేజ్‌మెంట్ కమిటీ ప్రతినిధుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోవాలని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ సూచించారు. అద్దంకి నియోజకవర్గంలో పాఠశాలల పునరుద్ధరణపై సోమవారం అమరావతిలో మంత్రి ఛాంబర్‌లో అన్ని మండలాల ఎంఈవోలతో చర్చించారు. ప్రస్తుతం ఉన్న ఏ ఒక్క పాఠశాల మూత పడకుండా చూడాలన్నారు. 15 ప్రాథమిక పాఠశాలలను ఫౌండేషన్ స్కూల్స్ (1, 2 తరగతులు మాత్రమే) మార్పే ప్రతిపాదనలపై ఎస్ఎంసీ ల నుంచి అభ్యంతరాలు వచ్చిన విషయాన్ని ఎంఈవో లు మంత్రి రవికుమార్ దృష్టికి తీసుకు వచ్చారు. దీనికి స్పందించిన మంత్రి స్కూల్ మేనేజిమెంట్ కమిటీ (ఎస్ఎంసీ)ల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకొని ఎలాంటి మార్పులు చేయకుండా కచ్చితంగా ప్రాథమిక పాఠశాలలుగా కొనసాగించాలన్నారు. నియోజకవర్గంలో 9 ఉన్నత పాఠశాలలు 68 మోడల్ స్కూల్స్‌గా మా రనున్నట్లు మంత్రి రవికుమార్‌కు వివరించారు. మంత్రిని కలిసినవారిలో చీరాల డిప్యూటీ ఎడ్యుకేషన్ ఆఫీసర్ గంగాధరరావు, ఎంఈవోలు సుధాకరరావు, పున్నయ్య, రమేష్, వీరాంజనేయులు, దినేష్ ఉన్నారు.

సూర్యలంకకు సొబగులు

రూ.40 లక్షలు కేటాయించిన ప్రభుత్వం

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

సూర్యలంక బీచ్‌కు మహర్దశ పట్టనుంది. పర్యాటక అభివృద్ధిలో భాగంగా కేంద్రం ఎంచుకున్న ప్రదేశాలలో సూర్యలంక తీరం ఉండగా రూ.100 కోట్ల నిధుల విడుదలకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన సంగతి తెలిసిందే. ఓ వైపు అందుకు సంబంధించి కసరత్తు జరుగుతుండగానే ప్రభుత్వం కూడా పర్యటక రంగం మీద దృష్టి పెట్టి వారికి సౌకర్యాల కల్పనకు పెద్దపీట వేసే కార్యక్రమాలకు శ్రీకారం చుట్టింది. రూ.40 లక్షల రూపాయల గ్రాంటు నిధులను ఖర్చు చేసి సూర్యలంక తీరంలో వసతులు కల్పించాలనే నిర్ణయాన్ని ప్రభుత్వం తీసుకుంది. ఆటవిడుపుకు వారాంతాల్లో ఇక్కడకు వచ్చే పర్యాటకుల సంఖ్య పెరుగుతూ వస్తోంది. రోజుకు రెండు నుంచి మూడు వేల మంది పర్యాటకులు సూర్యలంక తీరానికి వస్తుండగా, ఈసంఖ్య శని, ఆదివారాల్లో 5,000 వరకు ఉంటోంది. పర్యాటకులకు మరుగుదొడ్లు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తాగునీరు అందు బాటులో లేకపోవడం, స్పీడ్ బోట్లను గ్రాంటు నిధులతో ఏర్పాటు చేసేలా ప్రణాళికలు రూపొందిస్తున్నారు సూర్యలంక బీచ్‌లో సౌకర్యాలపై తొలుత ప్రభుత్వం దృష్టి పెట్టింది. ముందుగా పర్యాటకులకు ఎలాంటి ఇబ్బందులు లేని వాతావరణం కల్పించే దిశగా అడుగులు వేస్తోంది. డ్రెస్సింగ్ రూమ్స్, మంచినీటి సౌకర్యం, టాయిలెట్స్‌తో పాటు స్పీడ్‌బోట్లను ఏర్పాటు చేయడం వంటివన్నీ తొలి దశలో భాగంగా యుద్ధ ప్రాతిపదికన చేపట్టనున్నారు.



20 రోజులు.. రూ. 50 కోట్ల లక్ష్యం

- మార్కెట్ ఫీజుల వసూళ్లలో ఏఎంసీల వెనకడుగు
- బాపట్లలో ప్రకృతి విపత్తులు
- పల్నాడులో సాగునీటి కష్టాలు
- గుంటూరులో కొనుగోళ్ల సెస్సు పెండింగ్

గుంటూరు, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ మా ర్కెట్ కమిటీ(ఏఎంసీ)లలో మార్కెట్ ఫీజు వసూళ్లు ఈ ఏడాది అంత ఆశాజనకంగా లేవు. మరో 20 రోజుల్లో 2024-25 ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ముగియనుండగా నేటికీ 76 శాతం మధ్యనే వసూళ్లు జరిగాయి. ఇప్పటినుంచి కేవలం ఒక్క గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీలో మిర్చి లావాదేవీలు కారణంగా కొంతవరకు మార్కెట్ ఫీజు వ సూళ్లకు అవకాశం ఉన్నది. మిగతా ఏఎంసీల పరిధిలో కలెక్షన్స్ నామమాత్రంగానే జరుగుతాయి. ఈ నేపథ్యంలో మార్కెటింగ్ రాష్ట్ర శాఖ ఉమ్మడి గుంటూరు జిల్లాలోని ఏఎంసీలకు కేటాయిం చిన లక్ష్యాన్ని అధిగమించే పరిస్థితి కనిపించడం లేదు. ఈ నేపథ్యంలో మంగళవారం మార్కెటింగ్ కమిషనరేట్‌లో ఆ శాఖ డైరెక్టర్ అండ్ కమిషనర్ విజయ సునీత ఏఎంసీల సెక్రెటరీలు, ప్రాంతీయ జాయింట్ డైరెక్టర్లు, డీడీ, ఏడీలతో సమావేశం కావాలని నిర్ణయించారు.

2024-25 ఆర్థిక సంవత్సరానికి గుంటూరు జిల్లాకు మార్కెట్ ఫీజు వసూళ్లను రూ. 133.69 కోట్లుగా మార్కెటింగ్ శాఖ లక్ష్యాన్ని నిర్దే శించింది. అందులో ఇప్ప టివరకు 102.81 కోట్లు వసూలు చేసి 76.91 శాతం లక్ష్యానికి చేరుకొన్నది. పల్నాడు జిల్లా లోని 12 ఏఎంసీలైన నరసరావుపేట, చిలకలూరిపేట, రొంపిచర్ల, సత్తెనపల్లి, క్రోసూరు, రాజుపాలెం, పిడుగురాళ్ల, గురజాల,మాచర్ల, ఈపూరు, వినుకొండ, దుర్గికి కలిపి రూ.32.14 కోట్లు లక్ష్యం నిర్దేశించగా ఇప్పటి వరకు కేవలం రూ. 21 కోట్లు వ సూ త్రమే వసూళ్లు జరిగాయి. బాపట్ల జిల్లాలో ఏఎంసీలకు రూ. 30.21 కోట్లు లక్ష్యం ఇవ్వగా రూ. 22.65 కోట్లు వసూళ్లు చేశారు. ఈ విధంగా మూడు జిల్లాలకు కలిపి రూ. 196.08 కోట్లు లక్ష్యం కాగా రూ. 146.46 కోట్లు వసూలు చేశారు. ఇంకా రూ. 50 కోట్ల లోటు ఉన్నది.

మార్కెట్ ఫీజు కలెక్షన్ పైనే ఏఎంసీలు ఆధారపడి ఉన్నాయి. అయితే ఉమ్మడి జిల్లాలో కొన్ని మాత్రమే కార్యకలాపాలు జరిగే ఏఎంసీలు ఉండగా మిగతావాన్ని చెక్‌పోస్టులలో వసూలు చేసే సెస్సు పైనే ఆధారపడుతున్నాయి. గుంటూరు జిల్లాలో పేరుకు ఎనిమిది వ్యవసాయ మార్కెట్ కమిటీలుండగా వీటిల్లో గుంటూరు, దుగ్గిరాల, తెనాలి మాత్రమే కార్యకలాపాలు సాగిస్తున్నాయి. అలానే పల్నాడులో 12 ఏఎంసీలున్నప్పటికీ గురజాల ఒక్కటే కార్యకలాపాలు జరిపే యార్డుగా ఉన్నది. బాపట్లలో నాలుగు ఏఎంసీలుండగా ఇవన్నీ ధాన్యం, అపరాలపై ఆధారపడుతున్నాయి. కాగా గతేడాది రబీ సీజన్‌లో సాగర్ కాలువలకు సాగునీరు విడుదల చేయలేదు. దాంతో పంట విస్తీర్ణం తగ్గి మార్కెట్ ఫీజు వ సూళ్లపై దాని ప్రభావం పడింది. బాపట్ల జిల్లా లో ఈ ఏడాది ప్రకృతి విపత్తులు సంభవించ డంతో ఆగస్టు, సెప్టెంబరు నెలల్లో పంట లు దెబ్బతిన్నాయి. గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీలో ఈ సంవత్సరం మిర్చి ధర పతనం అయింది. గతేడాది క్వింటాల్ రూ. 18 వేల వరకు ఉంటే ఈ సంవత్సరం మార్కెట్ ప్రారంభంలో రూ. 9 వేల నుంచి రూ. 11వేల మధ్య నే ఉన్న ది. ఇది కూడా మార్కెట్ ఫీజు తగ్గడానికి కారణంగా మారింది. మరో వైపు పౌరసర ఫరాల సంస్థ చేస్తోన్న ధాన్యం కొనుగోళ్లు, సీసీఐ చేసిన పత్తి కొ నుగోళ్లపై ఇంకా ఏఎంసీలకు మార్కెట్ ఫీజులు జమ కాలేదు. మార్కెట్ ఫీజు వసూళ్లు తగ్గ డానికి వీటన్నింటిని కారణాలుగా మార్కె టింగ్ అధికారులు పేర్కొంటున్నారు.

ఉమ్మడి జిల్లా ఏఎంసీలలో ఫీజుల వసూళ్లు ఇలా...

మార్కెట్ కమిటీ	లక్ష్యం (రూ.కోట్లలో)	వసూళ్లు చేసిన మొత్తం (రూ.కోట్లలో)
ఫిరంగిపురం	1.95	1.19
మంగళగిరి	3.10	2.10
తాడికొండ	2.10	1.46
గుంటూరు	106	79.20
పొన్నూరు	6.95	6.10
ప్రత్తిపాడు	3.72	3.31
తెనాలి	6.60	6.18
దుగ్గిరాల	3.27	3.24
పల్నాడు (అన్ని ఏఎంసీలు)	32.14	21
బాపట్ల (అన్ని ఏఎంసీలు)	30.21	22.65
మొత్తం	196.08	146.46

మంగళగిరిలో ఉచిత బస్సు సేవలు

- సీఎస్ఆర్ నిధుల కింద రెండు బస్సులు మంజూరు
- ఒకటి ఎయిమ్స్‌కు.. మరోటి నృసింహాలయానికి..
- ఉచిత బస్సు సర్వీసులను ప్రారంభించిన మంత్రి లోకేశ్



బస్సులను ప్రారంభించి ఎయిమ్స్ డైరెక్టర్ శాంతా సింగ్‌కు తాళం అందజేస్తున్న మంత్రి లోకేశ్

మంగళగిరి, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): మంగళగిరిలో ఉచిత ఎలక్ట్రిక్ బస్సు సేవలు ప్రారంభమయ్యాయి. రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ సోమవారం ఉండవల్లిలోని నివాసంలో జెండా ఊపి ఈ బస్సులను ప్రారంభించారు. వివిధ జిల్లాలు, ఇతర రాష్ట్రాల నుంచి మంగళగిరి ఎయిమ్స్ ఆస్పత్రికి, పానకాల లక్ష్మీనృసింహస్వామి ఆలయానికి వచ్చే ప్రజలు సరైన రవాణా సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న మంత్రి లోకేశ్ సీఎస్ఆర్ నిధుల నుంచి బస్సులను సమకూర్చాల్సిందిగా మెగా ఇంజనీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌ను కోరారు. లోకేశ్ విజ్ఞప్తిపై సానుకూలంగా స్పందించిన సదరు సంస్థ రూ.2.4 కోట్ల విలువైన రెండు అత్యాధునిక ఒలెక్ట్రా ఏడు మీటర్ల ఎలక్ట్రిక్ బస్సులను అందజేసింది. ఒక బస్సు మంగళగిరి ఆర్టీసీ బస్టాండు నుంచి ఎన్ఆర్ఐ జంక్షన్, డీజీపీ కార్యాలయం మీదుగా ఎయిమ్స్‌కు నడుస్తుంది. మరో బస్సు మంగళగిరి బస్టాండు నుంచి ఎన్నారై జంక్షన్ మీదుగా పానకాలస్వామి గుడివరకు నడుస్తుంది. ఒలెక్ట్రా గ్రీన్ టెక్ లిమిటెడ్ సంస్థ చైర్మన్ అండ్ ఎండీ కేవీ ప్రదీప్, ఎయిమ్స్ డైరెక్టర్ డాక్టర్ శాంతా సింగ్ అహెంతెమ్, డిప్యూటీ డైరెక్టర్ శశికాంత్, నృసింహాలయ కార్యనిర్వహణాధికారి అన్నపురెడ్డి రామకోటిరెడ్డి, టీటీడీ బోర్డు మెంబరు తమ్మిశెట్టి జానకీదేవి, ఏపీ పద్మశాలి కార్పొరేషన్ చైర్మన్ నందం అబద్దయ్య, టీడీపీ దుగ్గిరాల మండల అధ్యక్షురాలు కేసంనేని శ్రీఅనిత, తాడేపల్లి మండల అధ్యక్షుడు అమరా సుబ్బారావు, పట్టణ అధ్యక్షుడు వల్లభనేని వెంకట్రావు, టీడీపీ నేతలు గోవాడ దుర్గారావు, షేక్ రియాజ్, కొల్లి శేషు, తాళ్ల అశోక్‌కుమార్ యాదవ్ పాల్గొన్నారు.

ఘనంగా వివా 'ఐబీ గ్రాడ్యుయేషన్' డే వేడుకలు



సర్టిఫికెట్లు పొందిన విద్యార్థులతో వీవీఐటీ చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్

పెదకాకాని, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): వివా ది స్కూల్‌లో అంతర్జాతీయ స్థాయి ఐబీ (ఇంటర్నేషనల్ బాకలారియేట్) విద్యావిధానంలో ప్రీ ప్రైమరీ విద్యను ముగించుకుని ప్రైమరీ విద్యకు, ప్రైమరీ విద్యను ముగించుకొని మిడిల్ స్కూలు ప్రవేశం పొందుతున్న విద్యార్థుల గ్రాడ్యుయేషన్ వేడుకలను ఘనంగా సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రేడ్ 1, గ్రేడ్ 6 తరగతులకు ప్రవేశించనున్న విద్యార్థులను అభినందిస్తూ చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్ సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక, శాస్త్రీయ, ఆధునిక నృత్యాలు, గీతాలు విశేషంగా అలరించాయి. కార్యక్రమంలో వివా డైరెక్టర్ లెఫ్టినెంట్ కమాండర్ కేఎస్.రావు, ప్రిన్సిపాల్ చదలవాడ సరళ, ఐబీ ప్రోగ్రాం సంధానకర్త కె.మాధవి, జూనియర్ క్యాంపస్ హెడ్ మామిళ్లపల్లి వేదవాణి, తల్లిదండ్రులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

దుబారాకు అడ్డుకట్ట పడేనా?

- అమరేశ్వరాలయంలో నిబంధనలు ఉల్లంఘించి మరీ ఖర్చులు
- కోర్టును ఆశ్రయించిన భక్తుడు



అమరేశ్వరస్వామి

అమరావతి, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): దినదినాభివృద్ధి చెందుతూ గ్రూప్ 2 ఆలయంగా గుర్తింపు పొందిన అమరావతిలోని బాలచాముండికా సమేత అమరేశ్వరాలయంలో స్వామివారి ఆదాయంపై జరుగుతున్న దుబారా ఖర్చులకు అడ్డుకట్ట పడేనా అని భక్తులు చర్చించుకుంటున్నారు. ఆలయాన్ని పునర్నిర్మించిన రాజా వాసిరెడ్డి వెంకటాద్రినాయుడు ఆలయ నిర్వహణకు, ఆలయంలో పనిచేసే అర్చకులకు, వివిధ సేవలు చేసే వారికి వందల ఎకరాలు దానం చేశారు. అమరేశ్వరునికి తెలంగాణ రాష్ట్రంలోని దెందులూరులో 485 ఎకరాలు, అమరావతిలో 67, దాములూరులో 5 , దమ్మాలపాడులో 110, మాదలలో 90 ఎకరాలు ఉండగా దెందులూరులోని భూమికి కౌలు ద్వారా రూ. 4 లక్షలు, ఇక్కడ ఉన్న భూములకు రూ. 26 లక్షలు ఆదాయం వస్తుంది. ఇక హుండీలు, ఆర్జిత సేవల ద్వారా రూ. 3.2 కోట్ల ఆదాయం వస్తుంది. వస్తున్న ఆదాయంలో అర్చకుల, ఉద్యోగుల జీతభత్యాలు 30 శాతం ఖర్చు చేయాల్సి ఉండగా అధికంగా 45 శాతం ఖర్చు చేస్తున్నారు.

రాజకీయ జోక్యంతో...

విజయవాడకు చెందిన మార్కండేయ శర్మ అనే భక్తుడు ఆలయంలో స్వామి వారి ఆదాయం ఖర్చు, అర్చకుల విధులు, కాంట్రాక్ట్ ఉద్యోగుల నియామకం, పెంచిన జీతాలు తదితర అంశాలపై అక్రమాలు జరుగుతున్నాయనీ, ఓ వైసీపీ నాయకుడి కారు డ్రైవర్‌కు కూడా జీతం ఇచ్చారని హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై వివరణ ఇవ్వాలని దేవదాయ కమిషనర్‌ను కోర్టు ఆదేశించగా ఆలయ అధికారుల నిర్వాకంతో తగిన సమయంలో వివరణ ఇవ్వలేదు. దీంతో పిటిషనర్ మళ్లీ కోర్టును ఆశ్రయించగా కోర్టు కమిషనర్‌పై ఆగ్రహం వ్యక్తం చేసి ఆలయంలో లావాదేవీలకు సంబంధించిన నివేదికను అందజేయాలని ఆదేశించింది. దీంతో కమిషనర్ ఇద్దరు డీసీలతో విచారణ కమిటీ ఏర్పాటు చేసి వారు తయారు చేసిన రిపోర్టును కోర్టుకు సమర్పించారు. ఆలయానికి ఆదాయం రూ. 3.5 కోట్లు ఉండగా, 30శాతం మాత్రం జీతాలకు ఖర్చు చేయాల్సి ఉంది. కానీ 45 శాతం ఖర్చు చేస్తున్నారు. పెంచిన జీతాలు, కాంట్రాక్టు సిబ్బంది నియామకం, ఇతర దేవాలయాల నుంచి ఇక్కడికి ఉద్యోగులు రావడం ఖర్చు పెరుగుదలకు కారణాలుగా గుర్తించారు. పెంచిన జీతాలు తగ్గించాలనీ, ఇతర దేవాలయాల నుంచి వచ్చిన వారిని వెనక్కు పంపించాల్సి ఉంది. ఈ మేరకు కోర్టు ఉత్తర్వులను కూడా అమలు చేయాల్సి ఉంది. రాజకీయ నాయకుల జోక్యంతో చర్యలు కొంత ఆలస్యం అవుతున్నట్లు తెలుస్తుంది. నిబంధనలు ఉల్లంఘించి ఆలయ ఆదాయంలో అదనంగా రూ. 50 లక్షల వరకు ఖర్చు చేస్తున్నారు. కొంతమంది ఉద్యోగులను మాతృసంస్థకు పంపేందుకు నోటీసులు ఇవ్వగా, కొందరిని ఆపేందుకు స్థానిక ప్రజాప్రతినిధి ప్రయత్నిస్తున్నట్లు సమాచారం.

సదావర్తి సత్రంలో కూడా..

ఆలయానికి అనుబంధంగా ఉన్న సదావర్తి సత్రంలో కూడా ఆదాయం కన్నా ఖర్చు అధికమౌతుంది. సత్రానికి మద్రాసులో 471 ఎకరాలు, కొగంటివారిపాలెంలో 71 ఎకరాలు భూములు ఉండగా మద్రాసులోని భూముల ద్వారా సత్రానికి రావాల్సిన రూ. 60 కోట్లు వైసీపీ నాయకుల కుట్రతో వెనక్కిపోయాయి. కొగంటివారిపాలెం భూములకు రూ.9 లక్షలు, రూమ్ అద్దెల ద్వారా రూ. 2లక్షలు ఆదాయం వస్తుంది. దీంతో సత్రం ఉద్యోగులకు కూడా జీతాలు అందడం లేదు. దీంతో అమరేశ్వరాలయానికి సత్రాన్ని దత్తత తీసుకోవడం ఎందుకని పిటిషనర్ ప్రశ్నించడంతో దానిని దత్తత నుంచి తొలగించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు సమాచారం.

వరలక్ష్మిని ఆదర్శంగా తీసుకోవాలి

- అవయవదానం చేసిన ఆమెకు ఘన నివాళులర్పించిన అధికారులు



వరలక్ష్మి భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న ఆర్డీవో పి.గ్లోరియా, డాక్టర్ ఎస్.విజయమ్మ, షేక్ సలీమా, డాక్టర్ సాయిబాబు



బాపట్ల, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): అవయవదానం ద్వారా కొపనాతి వరలక్ష్మి (45) అమరత్వం పొందింది. ఆమె మరణించినా, మన మధ్యనే జీవిస్తూ ఉంటుంది. ఆమె ఊపిరితిత్తులు, కాలేయం, కిడ్నీలు దానం చేయటం ద్వారా మరో ముగ్గురి జీవితాల్లోవెలుగులు నింపింది. ఆమె భర్త వీరకుమార్, మామయ్య నరసింహారావు ఉదాత్తమైన నిర్ణయం తీసుకున్నారు. ఆమెను ఆదర్శంగా తీసుకొని బ్రెయిడ్‌డెడ్ సంభవించిన పరిస్థితులలో అందరూ అవయవదానానికి ముందుకురావాలని పలువురు కోరారు. బాపట్ల పట్టణంలోని వివేకానంద కాలనీకి చెందిన కొపనాతి వీరకుమార్ స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నాడు. గతంలో బాపట్ల మండలం పాండురంగాపురం స్కూల్‌లో పనిచేసిన ఆయన 2017లో బదిలీపై మాచవరం మండలం లక్ష్మీపురం ఎంపీయూపీ స్కూల్‌కు వెళ్లారు. పల్నాడు ప్రాంతంలో నివాసం ఉంటున్న వీరకుమార్ భార్య వరలక్ష్మికి అనారోగ్యం రావటంతో ఆస్పత్రిలో చూయించి వైద్యం చేయిస్తున్నారు. మెదడు సంబంధింత వ్యాధితో ఈ నెల 6న గుంటూరులోని ఆస్టర్ రమేష్ హాస్పిటల్స్‌లో చేరారు. ఆదివారం ఆమె బ్రెయిడ్‌డెడ్ అయినట్లు వైద్యులు ప్రకటించారు. జీవన్‌దాన్ ప్రతినిధులు ఆమె కుటుంబ సభ్యులకు అవయవదానంపై అవగాహన కల్పించగా వారు అంగీకరించటంతో ఊపిరితిత్తులను సికింద్రాబాద్ కిమ్స్ ఆస్పత్రికి, కాలేయం, మూత్రపిండాలను ఆస్టర్ రమేష్ హాస్పిటల్‌కు కేటాయించారు. అనంతరం భౌతికకాయాన్ని సోమవారం వివేకానందకాలనీలోని వారి నివాసానికి తీసుకొచ్చారు. ఈ విషయం తెలుసుకున్న కలెక్టర్ జె.వెంకటమురళి ఆదేశాల మేరకు ఆర్డీవో పి.గ్లోరియా, జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారిణి డాక్టర్ ఎస్.విజయమ్మ, తహసీల్దార్ షేక్.సలీమా అక్కడకు చేరుకొని ఆమెకు నివాళులు అర్పించి భర్త వీరకుమార్ దాతృత్వాన్ని అభినందించారు. బాపట్ల జిల్లా శరీర, అవయవ దాతల సంఘం ప్రధాన కార్యదర్శి డాక్టర్ పీసీ.సాయిబాబు, సభ్యులు యాజలి భాస్కరరావు, యూటీఎఫ్ నాయకుడు జడ వినయ్‌కుమార్, ఎంఎస్ఎస్ భారతి, ఉదయకుమారి, అడుగుల శ్రీనివాసరావు, నూతలపాటి కోటేశ్వరరావు, శైలజ, సుందరదాసు, నాగరామారావు, ఉదయకుమారి తదితరులు పాల్గొని ఆమె మృతికి సంతాపం ప్రకటించి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలియజేశారు.

ఎమ్మెల్యే సంతాపం...

అవయవదానం చేసి ముగ్గురు ప్రాణాలు నిలబెట్టిన వరలక్ష్మి మరణంలోనూ జీవించే ఉంటారని ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ పేర్కొన్నారు. సాహసోపేతమైన నిర్ణయం తీసుకొని అవయవదానం చేసిన కుటుంబ సభ్యులను అభినందించారు.

రైతు రుణం ఉపశమన చట్టం అమలు చేయాలి

గుంటూరు సిటీ, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): అన్నదాతల ఆత్మహత్యలను నివారించేందుకు కేరళ రాష్ట్రంలో అమలు చేస్తున్న రైతు రుణం ఉపశమన చట్టం' దేశవ్యాప్తంగా అమలు చేయాలని మాజీ మంత్రి, అఖిల భారత రైతు సంఘాల సమన్వయ సమితి రాష్ట్ర కన్వీనర్ వడ్డే శోభనాద్రీశ్వరరావు డిమాండ్ చేశారు. సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో సోమవారం గుంటూరు చుట్టుగుంట సెంటర్ లో ఏర్పాటు చేసిన నిరసన కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు.ఈ సందర్భంగా జరిగిన సభకు రైతు సంఘం సీనియర్ నాయకులు వై.కేశవరావు అధ్యక్షత వహించారు. వడ్డే శోభనాద్రీశ్వరరావు మాట్లాడుతూ రైతులను ఆదుకునేందుకు సమగ్ర పంటల ఉత్పత్తి వ్యయానికి 50 శాతం కలిపి మద్దతు ధర నిర్ణయించాలని అన్నారు. సంయుక్త కిసాన్ మోర్చా జాతీయ మండలి తీసుకున్న నిర్ణయం మేరకు దేశంలోని అన్ని రాష్ట్ర కేంద్రాల్లో ఈ ధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కేంద్రంలోని మోడీ ప్రభుత్వం 2014 ఎన్నికలకు ముందు స్వామినాథన్ కమిషన్ సిఫార్సులు అమలు చేసి రైతులను ఆదుకుంటామని భరోసా ఇచ్చిందని గుర్తు చేశారు. అయితే ఆ తర్వాత కొద్ది కాలానికి ఈ సిఫార్సులు అమలు చేయడం సాధ్యం కాదని మోడీ ప్రభుత్వం సుప్రీంకోర్టులో అఫిడవిట్ దాఖలు చేసింది అన్నారు. వ్యవసాయంలో కార్పొరేటీకరణను అనుమతించడానికి జరుగుతున్న కుట్రను రైతులు ఉత్తరాది రాష్ట్రాల్లో పెద్ద ఎత్తున ఉద్యమించి నిలువరించారని తెలిపారు. రాష్ట్రంలో ఈ ఏడాది అన్ని రకాల పంటలకు కనీస మద్దతు ధరలు రాలేదన్నారు. తెలంగాణ, కర్ణాటక, కేరళలో రైతులకు కనీసం మద్దతు ధర రాకపోతే ధాన్యానికి బోనస్ ఇస్తున్నారని రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం ఈ విషయాన్ని ఏమాత్రం పట్టించుకోవడం లేదన్నారు. గుంటూరు ఛానల్ అభివృద్ధి, వరికపూడిసెల ఎత్తిపోతల పథకాలను నిర్లక్ష్యం చేస్తున్న టీడీపీ ప్రభుత్వం రూ.80వేల కోట్లతో బనకచర్ల చేపడతామని చెప్పడం ద్వారా కాంట్రాక్టర్లను బాగు చేయడం కోసమేనన్నారు. ఏపీ రైతు కూలీ సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు ఝాన్సీ, సభకు అధ్యక్షత వహించిన సీనియర్ రైతు నాయకులు వై కేశవరావు మాట్లాడుతూ రైతులకు మద్దతుగా రాకపోతే కేంద్ర ప్రభుత్వం మార్కెట్ ఇంటర్వెన్షన్ పథకం కింద రైతులను ఆదుకోవాల్సి ఉందన్నారు. కోకో రైస్ సంగం నాయకులు శ్రీనివాసరావు, రాష్ట్ర రైతు సంగం అధ్యక్షులు వి.కృష్ణయ్య, ప్రధాన కార్యదర్శి ప్రభాకర్ రెడ్డి, వివిధ రైతు సంఘాల నాయకులు సి.హెచ్. వెంకటేశ్వర్లు,చుండూరు రంగారావు, నల్లమడ రైతు సంఘం నాయకుడు కొల్లా రాజమోహన రావు, ఎం హరిబాబు, పి జమలయ్య, వెంకటరెడ్డి, ఆంజనేయులు, ఎం సూర్యనారాయణ. హనుమారెడ్డి, వివిధ రైతు సంఘాల జిల్లా నాయకులు కంచు మాటి అజయ్ కుమార్, ఉల్లిగడ్డ నాగేశ్వరావు, పచ్చల శివాజీ, వేల్పూరి నరసింహారావు, కొల్లి రంగారెడ్డి ఈమని అప్పారావు, బైరగాని శ్రీనివాసరావు, ఆవాజ్ రాష్ట్ర కార్యదర్శి మహమ్మద్ షఫీ, మెడికల్ యూనియన్ రాష్ట్ర నాయకులు కుమార్, సలీం తదితరులు ప్రసంగించారు.

జీవ ఇంధనమే భవిష్యత్తు తరాలకు ప్రత్యామ్నాయం

పెదకాకాని, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): జీవో ఇంధనమే భవిష్యత్తు తరాలకు ప్రత్యామ్నాయమని, గ్రీన్ ఎనర్జీపై అందరికీ అవగాహన ఉండాలని ఐఐఎమ్ నాగపూర్ కు చెందిన ఇండియన్ ఫెడరేషన్ ఆఫ్ గ్రీన్ ఎనర్జీ వ్యవస్థాపకులు వైభవ్ డాంగే పేర్కొన్నారు. సోమవారం వర్సిటీలో భారత ఆర్థిక వ్యవస్థలో బయో ఫ్యూయెల్, గ్రీన్ ఎనర్జీ ప్రభావంపై జరిగిన సదస్సులో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వైభవ్ డాంగే మాట్లాడుతూ భారతదేశ ఆర్థిక వ్యవస్థపై వీటి ప్రభావం ఎలా ఉంటుందో అనే అంశాలపై ఈ సమావేశంలో ఆయన చర్చించారు. కామర్స్, వ్యాపార నిర్వహణ శాస్త్ర విభాగాధిపతి ఆచార్య రామినేని శివరామ్ ప్రసాద్ ఈ సదస్సుకు సభాధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఏఎన్‌యూ ప్రవేశాల విభాగం సంచాలకులు ఆచార్య వి.బ్రహ్మజీ మాట్లాడుతూ పర్యావరణ సంరక్షణకు జీవ ఇంధనం ఎంతలా పడుతుందో వివరించి, వందన సమర్పణ చేశారు. గౌరవ అతిథులుగా ఏఎన్‌యూ తాత్కాలిక ఉపకులపతి ఆచార్య కంచర్ల గంగాధరరావు, రెక్టార్ ఆచార్య కె. రత్నషీలామణి, ఆర్ట్స్ కామర్స్ లా కళాశాల ప్రచార్యులు ఆచార్య ఎమ్ సురేష్ కుమార్, సైన్స్ కళాశాల ప్రచార్యులు ఆచార్య కె వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

బాపట్ల ఎడ్లజతకు ప్రథమ స్థానం



ప్రథమ స్థానంలో నిలిచిన ఎడ్లజత

రాజుపాలెం, మార్చి10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆకులగణపవరం గ్రామంలోని ప్రసన్నాంజనేయ స్వామి వారి 96వ జయంతి మహోత్సవాలను పురస్కరించుకుని ఏర్పాటు చేసిన జాతీయ స్థాయి ఎడ్ల పోటీలు రసవత్తరంగా కొనసాగుతున్నాయి. ఆదివారం నిర్వహించిన ఆరుపళ్ల దూడల విభాగంలో మొత్తం 10ఎడ్ల జతలు పాల్గొన్నాయి. ఆరుపళ్ళ దూడల విభాగంలో నిర్ణీత 15 నిమిషాల కాల వ్యవధిలో బాపట్ల జిల్లా చుండూరు మండలం వేటపాలెం అత్తోట శిరీషా శివకృష్ణ చౌదరికి చెందిన ఎడ్లజత 4250 అడుగుల దూరం లాగి ప్రథమ స్థానంలో నిలిచాయి. విజయవాడకు చెందిన వల్లభనేని మోహనరావు, సూర్యాపేట జిల్లా కోదాడ మండలం రామలక్ష్మపురంకు చెందిన ఉత్తం పద్మావతి రెడ్డి కంబైన్స్ ఎడ్లజత 4000 అడుగుల దూరం లాగి రెండో స్థానంలో, పల్నాడు జిల్లా దాచేపల్లి మండలం కేసానుపల్లి గ్రామానికి చెందిన నెల్లూరి రామకోటయ్య ఎడ్లజత 3783.9 అడుగుల దూరం లాగి మూడో స్థానంలో నిలిచాయి. విజేతలుగా నిలిచిన ఎడ్లజతల యజమానులకు రూ. 35 వేలు, రూ. 25వేలు, రూ. 20వేలు నగదు బహుమతితో పాటు స్వామివారి చిత్రపటాలను అందజేశారు.

కృష్ణా డెల్టాకు.. మళ్లీ మహర్దశ!

(5వ పేజీ తరువాయి)

పరిష్కారాన్ని చూపే దిశగా కూటమి ప్రభుత్వం తొలి అడుగు వేసింది. ఆధునికీకరణ పనులు దశాబ్దాలుగా ప్రతిపాదనలకే పరిమితమయిన తరుణంలో ఏకంగా డ్రెయిన్ వెడల్పు చేయటం కీలకం కావటంతో, ఆ పనులను చేయాలని నిర్ణయిచంటంతో ఇక్కడి రైతుల్లో హర్షం వ్యక్తం అవుతోంది. పొన్నూరు, బాపట్ల, పెదనందిపాడు, కాకుమాను, పర్చూరు మండలాల పరిధిలో ఉన్న ఈ డ్రెయిన్ సమస్య ఇప్పటి కాదు. దీనిపై 1964 నుంచి ప్రభుత్వాలు కమిటీలు వేస్తూనే వచ్చాయి. అప్పటి మిత్ర కమిటీ దగ్గర నుంచి 2006 వరకు సాగిన నిపుణుల కమిటీలు అనేక సూచనలు చేస్తే, వాటిని ఇప్పటి వరకు బుట్టదాఖలు చేస్తూ వచ్చారు. అయితే తాజాగా కూటమి ప్రభుత్వం అప్పటి మిత్ర కమిటీ నుంచి తాజా కమిటీలు చూపిన వాటిలో ప్రధానమైన ఆధునికీకరణ పనులకే ప్రాధాన్యం ఇచ్చారు. దీనికి రూ. 480 కోట్ల ఖర్చవుతున్నప్పటికీ వాటిని పూర్తిచేయాలనే నిర్ణయానికి రావటంతో, ప్రతిపాదనలుకూడా ప్రభుత్వానికి నీటిపారుదల శాఖ పంపింది. నల్లమడ డ్రెయిన్ ఇప్పటి వరకు 300 సీ (కోఎఫిషియంట్ ఆఫ్ డిశ్చార్జ్) వ్యాల్యూ ప్రకారం ఉంది. అయితే దీనిని 500 సీ వాల్యూ ప్రకారం వెడల్పు చెయ్యాలి. దీనికోసం అదనంగా భూమినికూడా సేకరించాల్సి ఉంటుంది. ఈ రూ. 480 కోట్లలో రూ. 300 కోట్లు డ్రెయిన్ ఆధునికీకరణ పనులకు కేటాయిస్తే, మిగిలిన రూ. 180 కోట్లు భూ సేకరణ కోసం కేటాయించారు. ఈ 500 సీ వాల్యూ ప్రకారం డ్రెయిన్ వెడల్పు జరిగితే పంట ముంపునకు గురవకుండా చేతికి అందుతుంది. ఈ పనులను గత చంద్రబాబు ప్రభుత్వం ఉన్నప్పుడు 2016లోనే చెయ్యాలని నిర్ణయించారు. అయితే అప్పట్లో నిధులు మంజూరు చేయటం, టెండర్లు పిలవటం వరకు జరిగినా, పనులు మాత్రం మొదలు కాలేదు. తర్వాత వచ్చిన ప్రభుత్వం అసలు దీనిని పక్కన పెట్టేసింది. అయితే మళ్లీ కూటమి సర్కారు వచ్చాక ఈ పనుల్లో కదలిక వచ్చింది.

మళ్లీ డెల్టా అధునికీకరణకు శ్రీకారం

కృష్ణా డెల్టా అధునికీకరణకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. 2007లో ఆధునికీకరణ జరగటం మినహా తర్వాత వీటిపై పెద్దగా పనులేవీ జరిగిన దాఖలాలు లేవు. దీంతో డెల్టాలోని కాల్వలన్నీ శిథిల స్థితికి చేరిపోయాయి. ఈ తరుణంలో ఆధునికీకరణ ఒక్కటే మార్గం కావటంతో దీనికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇచ్చింది. దీనికోసం ప్రతిపాదనలు పంపాలను నీటిపారుదల శాఖకు ఆదేశాలు పంపింది. ఈ మేరకు అంచనాలు రూపొందించే పనిలో నీటిపారుదల శాఖ ఉంది. గతంలో డెల్టా కాల్వల ఆధునికీకరణ రూ. 1024 కోట్లు కేటాయించారు. అయితే వీటిలో 60 శాతం నిధులే సద్వినియోగం అయ్యాయి. రూ. 408 కోట్ల విలువైన కొమ్మమూరు కాల్వ పనులు మాత్రం ఒక్కటి కూడా జరగలేదు. దీంతో ఈ కాల్వపై సాగునీటి కష్టాలు మరింత పెరిగిపోయాయి. నీరు పుష్కలంగా ఉన్నప్పుడు కట్టలకు గండ్లు పడుతున్న పరిస్థితి కూడా ఉంది. అయితే ఆధునికీకరణ చేస్తే ఈ కాల్వ కిందున్న రైతులకు కష్టాలు తీరినట్టే. ఈసారి ఆధునికీరణ చేపట్టాలంటే కనీసం రూ. 1500 కోట్ల వరకు ఖర్చవుతుందని నీటిపారుదల శాఖ అంచనా. అంత మొత్తం ఇప్పుడున్న పరిస్థితుల్లో మంజూరవుతుందా! లేక కుదింపు వంటి కార్యక్రమం ఉంటుందా అనే అనుమానాలుకూడా ఉన్నాయి. ఈ విషయంలో కూటమి ప్రభుత్వం ఏవిధంగా ముందుకు వెళతుందనేది చూడాల్సిందే.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.20 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	91, 99, 110
చికెన్ విత్ స్కిన్	176.00
చికెన్ స్కిన్ లెస్	186.00

మహిళా ఆర్థిక స్వావలంబన దిశగా చంద్రన్న అడుగులు

• బాపట్ల అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్ సలగల


మాట్లాడుతున్న సలగల రాజశేఖరబాబు

బాపట్ల, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించే దిశగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అడుగులు వేస్తున్నారని బాపట్ల అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్, టీడీపీ జిల్లా అధ్యక్షుడు సలగల రాజశేఖరబాబు అన్నారు. పట్టణంలో సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం లక్షమంది మహిళలను పారిశ్రామికవేత్తలుగా తయారు చేయటమే లక్ష్యంగా సెర్ప్, మెప్మా, ఎంఎస్ఎంఈ రంగాలలో ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి పెట్టిందన్నారు. దీనికి సంబంధించిన ప్రకటన ముఖ్యమంత్రి విడుదల చేశారన్నారు. మెప్మాలో 30 వేల మంది, రాపిడ్‌లో 10 వేల మంది మహిళలు స్వయం ఉపాధి పథకంలో 4 వేలు, టూరిజం సంబంధిత రంగాలలో 4 వేలు, హోటల్‌లో 4 వేలు చొప్పున అనేక రంగాలలో జీవనోపాధి కల్పించేందుకు కార్యాచరణ విడుదల చేసిందన్నారు. ఈ విధంగా మహిళల భద్రత కోసం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు విశేష కృషి చేస్తున్నారన్నారు.

మున్సిపాలిటీకి మూడు ట్రాక్టర్లు, ఎక్స్‌కవేటర్

బాపట్ల, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో పారిశుధ్య పనులు ముమ్మరంగా నిర్వహించేందుకు అవసరమైన యంత్ర పరికరాలను ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ సహకారంతో కమిషనర్ జి.రఘునాథరెడ్డి మూడు ట్రాక్టర్‌లను, ఒక ఎక్స్‌కవేటర్‌ని కొనుగోలు చేసి తెచ్చారు. మున్సిపల్ కార్యాలయానికి వచ్చిన యంత్రాలను సోమవారం కమిషనర్ పరిశీలించి త్వరితగతిన వీటిని పారిశుధ్య పనులకు అందుబాటులోకి తెస్తామని చెప్పారు. సీబీజెడ్ చర్చి వద్ద పారిశుధ్య కార్మికుల హాజరు పట్టిని కమిషనర్ తనిఖీ చేశారు. పారిశుధ్యం విషయంలో అలసత్వం వహించరాదని ఆదేశించారు. సూర్యలంక రోడ్డులో చెత్తలోడింగ్ పాయింట్‌ను పరిశీలించారు. అనంతరం ఇమ్మడిశెట్టిపాలెం సచివాలయం పరిధిలో పి4 సర్వే గురించి సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఏఈ ప్రసాద్, శానిటరి సిబ్బంది పాల్గొన్నారు.


పురపాలక సంఘానికి నూతనంగా కొనుగోలు చేసిన ఎక్స్‌కవేటర్, ట్రాక్టర్‌లను పరిశీలిస్తున్న కమిషనర్ జి.రఘునాథరెడ్డి

సైనిక వెల్ఫేర్ ఫండ్‌కు రూ.10.30 లక్షలు అందజేత

బాపట్ల, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ స్వయం సహాయక సంఘాల నుంచి సైనిక వెల్ఫేర్ ఫండ్ కోసం సేకరించిన రూ.10.30 లక్షల చెక్కును జాయింట్ కలెక్టర్ ప్రఖర్‌జైన్‌కు సోమవారం అందజేశారు. డీఆర్‌డీఏ పీడీ పద్మజ తమ సిబ్బందితో కలిసి చెక్కును అందజేయగా జేసీ ఆమెను అభినందించి సత్కరించారు. ఈ విధంగా వెల్ఫేర్ ఫండ్ ఏర్పాటు చేయటం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.


సైనిక వెల్ఫేర్ ఫండ్ కోసం సేకరించిన చెక్కును జేసీ ప్రఖర్‌జైన్‌కు అందజేస్తున్న డీఆర్‌డీఏ పీడీ పద్మజ తదితరులు

సావిత్రిబాయిపూలేకు ఘన నివాళి

బాపట్ల, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : మహిళా విద్యాభివృద్ధికి విశేష కృషి చేసిన తొలి తరం మహిళ సావిత్రిబాయిపూలే వర్థంతిని సోమవారం బహుజనసమాజ్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించారు. మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలోని పూలే దంపతుల విగ్రహాలకు పుష్పాంజలి ఘటించి వారి సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకుడు గడ్డం ఏలియా, జిల్లా అధ్యక్షుడు కాగిత కోటేశ్వరరావు, నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ గుదే రాజారావు, పాలపర్తి సంతమ్మ, మిండాల రూస్సీ, చింతా ఆనంద్, ప్రశాంత్ పాల్గొన్నారు.


సావిత్రిబాయిపూలే విగ్రహానికి పుష్పాంజలి ఘటిస్తున్న నాయకులు

పది విద్యార్థులకు పరీక్ష ప్యాడ్‌లు పంపిణీ

బాపట్ల, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని గిరిజన సంక్షేమ బాలికల వసతి గృహంలో 10వ తరగతి చదువుతున్న విద్యార్థినులకు జేసీఎస్ఎంఎం సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో సోమవారం పరీక్ష ప్యాడ్‌లు పంపిణీ చేశారు. సొసైటీ అధ్యక్షుడు కన్నెగంటి జాన్‌వెస్లీ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి విద్యుత్ శాఖ జేఈ సహదేవుడు ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ విద్యతోనే ప్రగతి సాధ్యమని, విద్యార్థినులు చక్కగా చదువుకొని ఉన్నతంగా రాణించాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కె.సుజాత, జోసఫ్ పాల్గొన్నారు.


విద్యార్థులకు పరీక్ష ప్యాడ్‌లు అందజేస్తున్న జాన్‌వెస్లీ తదితరులు

పరీక్షలకు విద్యార్థులు సిద్ధం : ఎంఈవో-2

పిట్టలవానిపాలెం, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు చెందిన 10వ తరగతి విద్యార్థినీ, విద్యార్థులు ఈనెల 17వ తేదీ నుంచి జరిగే పరీక్షలకు సిద్ధమౌతున్నారని మండల విద్యాశాఖాధికారి-2 కె.రాజారత్నం తెలిపారు. పిట్టలవానిపాలెం ప్రభుత్వ ఉన్నత పాఠశాల, చందోలు నీలిబంగారయ్య జడ్పీ ఉన్నత పాఠశాల, మంతెనవారిపాలెం జడ్పీ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి పరీక్ష కేంద్రాలను ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆయన చెప్పారు.

అర్జీదారులకు అల్పాహారం అందజేత


కలెక్టరేట్‌లో అర్జీదారులకు అల్పాహారం అందజేస్తున్న రెడ్‌క్రాస్ నాయకులు

బాపట్ల, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : దూరప్రాంతాలు నుంచి సమస్యలు వివరించేందుకు ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వచ్చే అర్జీదారులకు బాపట్ల రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో సోమవారం అల్పాహారం ఏర్పాటు చేశారు. బొడ్డుపల్లి మణికంఠ సత్యనారాయణ సౌజన్యంతో ఏర్పాటు చేసిన అల్పాహారాన్ని రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ బీఎస్ నారాయణభట్టు, నాయకులు రమణబాబు, బూర్లె రామసుబ్బారావు, బొడ్డుపల్లి శ్రీరామచంద్రమూర్తి, గోపికృష్ణ తదితరులు అర్జీదారులకు అందజేశారు.


జేసీ ప్రఖర్‌జైన్‌కు వినతిపత్రం అందజేసి సమస్యలు వివరిస్తున్న బాధితులు


రేపల్లె ఆర్డీవో రామలక్ష్మికి వినతిపత్రాన్ని అందిస్తున్న ప్రజలు

అర్జీలు త్వరగా పరిష్కరించాలి

• జాయింట్ కలెక్టర్ ప్రఖర్‌జైన్

బాపట్ల, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ప్రజా సమస్యల పరిష్కారవేదికలో వచ్చిన అర్జీలపై ప్రజలు సంతృప్తి పొందే విధంగా పరిష్కరించాలని జాయింట్ కలెక్టర్ ప్రఖర్‌జైన్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం ఆయన ప్రజా సమస్యల పరిష్కారవేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. అర్జీలు స్వీకరించి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం విధించిన గడువులోగా అర్జీలను పరిష్కరించటానికి చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో వ్యవసాయ పంటల కోతలు పూర్తయినందున నీటి పన్ను వసూళ్ళు చేయటానికి చర్యలు తీసుకోవాలన్నారు. పి4 సర్వేను వేగవంతంగా పూర్తి చేయటానికి చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో 2 లక్షల మంది ప్రజలతో స్కాన్ చేయించాల్సిన లక్ష్యం ఉందని చెప్పారు. ప్రభుత్వ దాతల ప్రజల భాగస్వామ్యం పి4తో ప్రతి ఇంటికి అభివృద్ధి.. జీవితానికి ప్రగతి అనే వాల్‌పోస్టర్‌ను జేసీ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి జి.గంగాధర్‌గౌడ్, ఆర్డీవో పి.గ్లోరియా, సర్వశిక్షాభియాన్ ప్రాజెక్ట్ ఆఫీసర్ నాగిరెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి ప్రభాకర్, డీఆర్‌డీఏ పీడీ పద్మజ, డ్వామా పీడీ విజయలక్ష్మి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారిణి డాక్టర్ ఎస్.విజయమ్మ, జిల్లా రవాణాశాఖాధికారి పరందామరెడ్డి, జిల్లా వ్యవసాయశాఖాధికారి రామకృష్ణ, సాంఘిక సంక్షేమశాఖాధికారి జె.రాజాదెబోరా, బీసీ సంక్షేమశాఖాధికారి శివలీల తదితరులు పాల్గొన్నారు.

నల్లబర్లి పొగాకు కొనుగోలుకు చర్యలు తీసుకోవాలి

బాపట్ల రూరల్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని అద్దంకి, పర్చూరు నియోజకవర్గంలోని రైతులు పండించిన నల్లబర్లి పొగాకు కొనుగోలుకు జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు చర్యలు తీసుకోవాలని సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కారవేదిక కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్‌కు వినతిపత్రాన్ని సీపీఎం జిల్లా కార్యదర్శి సీహెచ్ గంగయ్య అందజేశారు. అనంతరం కలెక్టరేట్ ఎదుట విలేకర్లతో మాట్లాడుతూ అద్దంకి, పర్చూరు నియోజకవర్గంలో సుమారు 30 వేల ఎకరాలలో నల్లబర్లి పొగాకు వేయటం జరిగిందని, మధ్య దళారులు క్వింటాకు 4, 5 వేల రూపాయలు కన్నా ఎక్కువ కొనే పరిస్థితి లేదన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు పొగాకు రైతులను ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు టి.కృష్ణమోహన్, జిల్లా కమిటీ సభ్యుడు పి.కొండయ్య పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కార వేదికకు నాలుగు అర్జీలు

రేపల్లె, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : సమస్యల పరిష్కారం కోసమే ప్రభుత్వం పటిష్టమైన ప్రజా సమస్యల పరిష్కార వేదికను ఏర్పాటు చేసిందని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆర్డీవో రామలక్ష్మి అన్నారు. ఆర్డీవో కార్యాలయంలో సోమవారం ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. రేపల్లె మండలం కారుమూరు గ్రామానికి చెందిన నల్లపాటి కోటేశ్వరి తన భర్త రమేష్ చనిపోవటంతో వితంతువు పెన్షన్ మంజూరు చేయాలని కోరారు. రేపల్లెకి చెందిన ఒడుగు రాంబాబు నిజాంపట్నం మండలం అడవులదీవిలో సర్వే నెంబర్ 377/4లో 0.91 సెంట్ల భూమి కలదని 0.71 సెంట్లు మాత్రమే ఆన్‌లైన్ చేశారని మిగతా 0.20 సెంట్లు ఆన్‌లైన్ చేయాలని అర్జీ దాఖలు చేశారు. చెరుకుపల్లి మండలం గూడవల్లి గ్రామానికి చెందిన గంటా శివనాగేశ్వరరావు తమ భూమిని ఇతరులు ఆక్రమించుకున్నారని దానిని తిరిగి ఇప్పించాలని కోరారు. చుండూరు మండలం యడ్లపల్లికి చెందిన లింగినేని కృష్ణమూర్తి తనకు 1.69 సెంట్ల భూమి ఉందని, 1.59 సెంట్లు మాత్రమే భూమి ఆన్‌లైన్‌లో చూపబడిందని, మిగతా 0.10సెంట్లు ఆన్‌లైన్ చేయాలని అర్జీ దాఖలు చేశారు. ఈ అర్జీలను పరిశీలించి త్వరితగతిన పరిష్కరిస్తామని ఆర్డీవో తెలిపారు.

పిట్టలవానిపాలెంలో రెండు అర్జీలు


కార్యక్రమంలో పాల్గొన్న తహసీల్దార్ డి.వెంకటేశ్వరరావు, ఎంపీడీవో సత్యనారాయణరావు తదితరులు

పిట్టలవానిపాలెం, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం తహసీల్దార్ డి.వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన పీజీఆర్ఎస్ కార్యక్రమంలో రెండు అర్జీలు అందాయి. మండలంలోని కొత్తపాలెం, ఖాజీపాలెం గ్రామాల నుంచి నివేశన స్థలం కోసం ఒక అర్జీ, ఖాజీపాలెంలో భూసర్వే కోసం అర్జీ అందినట్లు తహసీల్దార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఐ.సత్యనారాయణరావు, ఈవోపీఆర్డీ ఎ.ఏలీషాబాబు, వ్యవసాయశాఖాధికారి సత్యానంద్, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు ఎ.అరుణకుమారి, వి.రాధ, పీఆర్ఏఈ రఘు, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ కె.భాగ్యరాజు, ఏపీవో సుభాషిణి, ఏపీఎం సంతోష్‌కుమార్, మండల సర్వేయర్లు ఆదిరామచంద్రరావు, ఆర్ఐ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలను అర్జీల రూపంలో అందజేయాలి

కర్లపాలెం, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : కర్లపాలెం రెవెన్యూ కార్యాలయంలో జరిగిన ప్రజా సమస్యల పరిష్కారవేదికలో సోమవారం మండలాధికారులు పాల్గొన్నారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలు వారి సమస్యలను అర్జీల రూపంలో అందజేయాలని కోరారు.


ప్రజా సమస్యల పరిష్కారవేదికలో పాల్గొన్న కర్లపాలెం మండలాధికారులు

బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలి

బాపట్ల రూరల్, మార్చి10 (ఆంధ్రజ్యోతి) : బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలంటూ సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కారవేదిక కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ఎరుకుల సేవా సంఘం బాపట్ల జిల్లా అధ్యక్షుడు టి.శ్రీనివాసరావు జాయింట్ కలెక్టర్ ప్రఖర్‌జైన్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. అనంతరం కలెక్టరేట్ ఎదుట విలేకర్లతో మాట్లాడుతూ నగరం మండలంలో బాలికపై అత్యాచారానికి పాల్పడిన అగ్ర కులానికి చెందిన వ్యక్తిని కఠినంగా శిక్షించి బాధిత కుటుంబానికి ఎక్స్‌గ్రేషియా ఇచ్చి న్యాయం చేయాలని కోరారు. బాధిత కుటుంబంలో ఒక వ్యక్తికి ప్రభుత్వం ఉద్యోగం, రెండు ఎకరాల వ్యవసాయ భూమి కల్పించే దిశగా ప్రభుత్వం ఆలోచించాలని సంఘం తరుపున వేడుకుంటున్నామని తెలిపారు.

వ్యక్తిపై దాడి, వాహన దహనంపై కేసు నమోదు

కొల్లూరు, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : ఓ వ్యక్తిపై దాడి చేయడంతో పాటు ద్విచక్ర వాహనాన్ని దహనం చేసిన వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఏడుకొండలు సోమవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. ఈనెల 8వ తేదీన గాజుల్లంక గ్రామానికి చెందిన తుంగల సీతయ్య పోతార్లంక గ్రామానికి చెందిన నాయుడు వెంకటేశ్వరమ్మ పని చేస్తున్న పొలం వద్దకు వెళ్లి ఆమె కొడుకు సందీప్ తనకు ఇవ్వాల్సిన రూ.50 వేలు ఇవ్వమని అడుగుతుంటే ఇవ్వడం లేదని అడుగగా ఆమె తన కొడుకులకు సమాచారం ఇచ్చి సీతయ్యపై దాడి చేయడంతో పాటు ద్విచక్ర వాహనాన్ని పెట్రోల్ పోసి తగల బెట్టారని బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఘనంగా శ్రీ చెన్నకేశవస్వామి వార్షిక కల్యాణోత్సవం


ప్రత్యేక అలంకరణలో శ్రీచెన్నకేశవస్వామి

పిట్టలవానిపాలెం, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చందోలు గ్రామంలో ఉన్న శ్రీచెన్నకేశవస్వామి వార్షిక కల్యాణోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం 11 గంటలకు స్వామిని పెండ్లి కుమారునిగా ఆలయ అర్చకులు ముస్తాబు చేశారని, అదేవిధంగా రాత్రి 7 గంటలు నుంచి పుణ్యాహవచన, అంకురార్పణ, మండపారాధన, రాత్రి 7.30 గంటలకు శ్రీకోదండరామ భజన సమాజం, చందోలు వారిచే భజన నిర్వహించారని త్రిముఖ దేవాలయాల కార్యనిర్వాహణాధికారి జి.నరసింహమూర్తి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

శ్రీ జనార్దనస్వామి...

కర్లపాలెం, మార్చి10 (ఆంధ్రజ్యోతి) : కర్లపాలెం అగ్రహారంలోని శ్రీ జనార్దనస్వామి దేవాలయంలో అర్చక స్వామి బృందావనం శ్రీనివాసచార్యులు ఆధ్వర్యంలో జనార్దనస్వామి కల్యాణం సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హనుమంతరావు, శ్రీవిద్య దంపతులు కల్యాణ మహోత్సవంలో పాల్గొని పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని జనార్దనస్వామి వారి కల్యాణం తిలకించారు. ఈ కార్యక్రమంలో పరిమి దత్తాత్రేయ శర్మ, శ్రీమన్నారాయణ, వరదరాజులు, కర్లపాలెం పార్థసారధి, సామంతపూడి వెంకటరామరాజు తదితరులు పాల్గొన్నారు.

నగరంలో విద్యుత్ శాఖ తనిఖీలు

• 188 మందిపై కేసులు • రూ.8.49 లక్షల జరిమానా

నగరం, మార్చి10(ఆంధ్రజ్యోతి) : మండలంలోని వివిధ గ్రామాలలో విద్యుత్ శాఖ విజిలెన్స్ అధికారులు విస్తృత తనిఖీలు నిర్వహించారు. అధికారులు 48 బృందాలుగా విడిపోయి 2,995 సర్వీస్‌లను పరిశీలించారు. తనిఖీల్లో 188 మంది వినియోగదారులకు రూ.8 లక్షల 49 వేల జరిమానా విధించారు. విద్యుత్ చౌర్యానికి ఒక్క కేసుకు రూ.3 వేల జరిమానా, అదనపు లోడ్‌కు 175 కేసులకు రూ.8 లక్షల జరిమానా, మాల్‌ప్రాక్టీస్ పది కేసులకు రూ.46 వేల జరిమానా విధించినట్లు బాపట్ల ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌లు జీ.భాస్కరరావు, వెంకన్న చౌదరి తెలిపారు. తనిఖీల్లో చెరుకుపల్లి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎన్.సురేష్‌బాబు, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌లు జీ.శ్యామ్‌కుమార్ (పొన్నూరు), ఆర్.విజయ్‌శ్రీనివాస్ (బాపట్ల), నగరం అసిస్టెంట్ ఇంజనీర్ ఎండీ నాగూర్‌మీరా తదితరులు పాల్గొన్నారు.

కుట్టుమిషన్ శిక్షణకు దరఖాస్తులు చేసుకోవాలి

రేపల్లె, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో అర్హులైన వారు కుట్టుమిషన్ శిక్షణకు దరఖాస్తులు చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ కె.సాంబశివరావు తెలిపారు. ఆయన సోమవారం మాట్లాడుతూ జిల్లాలో వెనుకబడిన తరగతుల సేవా సహకార సంఘం లిమిటెడ్ ఆధ్వర్యంలో పట్టణంలోని మహిళలకు కుట్టుమిషన్ల శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. బీసీ, ఈడబ్ల్యూఎస్, కమ్మ, రెడ్డి, ఆర్యవైశ్య, క్షత్రియ, బ్రాహ్మణ సామాజికవర్గాలకు చెందిన మహిళలు దరఖాస్తులు చేసకోవాలని సూచించారు. 18 నుంచి 45 సంవత్సరాల లోపు వయసు కలిగి ఉండాలని, 90 రోజుల శిక్షణ అనంతరం కుట్టుమిషన్లు అందజేస్తారని తెలిపారు. ఈనెల 31వ తేదీలోపు సమీప సచివాలయంలో దరఖాస్తు చేసుకోవాలని ఆయన కోరారు.

ఎస్వీఆర్ఎం కళాశాలలో మహిళా దినోత్సవం

నగరం, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : ఎస్వీఆర్ఎం కళాశాలలో మహిళా సాధికారత సెల్ అంతర్జాతీయ మహిళా దినోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రిన్సిపాల్ అనగాని హరికృష్ణ అధ్యక్షత వహించారు. ఆయన మాట్లాడుతూ సమాజంలో అన్ని రంగాల్లో మహిళలు ప్రతిభను చాటుకుంటూ ముందుకు సాగుతున్నారని ఆయన అన్నారు. కళాశాల కరస్పాండెంట్ వల్లభనేని బుచ్చయ్యచౌదరి మాట్లాడుతూ మహిళలు సాధించిన విజయాలను గుర్తించినందుకే ఈ దినోత్సవం ఒక ఉత్తమ వేడుక అని అన్నారు. విద్యార్థినీ, విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ కార్యక్రమంలో మహిళా సాధికారిత అనురాధ, వెంకటనారాయణ, ఎ.కోకిల, శ్రీదేవి, అమరేష్ రెడ్డి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.


మహిళలను సత్కరిస్తున్న కళాశాల కరస్పాండెంట్ వల్లభనేని బుచ్చయ్యచౌదరి

సోము వీర్రాజు ఎంపికపై హర్షం

బాపట్ల, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : బీజేపీ సీనియర్ నాయకుడు సోమువీర్రాజును ఎమ్మెల్సీగా ఎంపిక చేయటం హర్షణీయమని ఆ పార్టీ జాతీయ కౌన్సిల్ సభ్యుడు బి.బాబునాగేంద్ర అన్నారు. ఈ సందర్భంగా ఆయనకు అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మామిడి రమేష్‌కుమార్ తదితరులు ఉన్నారు.

చట్టపరిధిలో అర్జీలు పరిష్కరిస్తాం : ఎస్పీ

• ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 89 అర్జీలు

బాపట్ల, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వచ్చిన ప్రతి అర్జీని చట్టపరిధిలో విచారించి పరిష్కరిస్తామని ఎస్పీ తుషార్‌డూడి భరోసానిచ్చారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ఈ కార్యక్రమానికి జిల్లా నుంచి 89 మంది వచ్చి అర్జీల ద్వారా తమ సమస్యలను ఎస్పీకి వివరించారు. ఎస్పీ మాట్లాడుతూ ఫిర్యాదుదారులిచ్చిన అర్జీలను పరిష్కరించాలని పోలీసు అధికారులను ఆదేశించారు. అర్జీలు పునరావృతం కాకుండా శాశ్వత పరిష్కారం చూపాలన్నారు. అర్జీల పరిష్కారం కోసం తీసుకున్న చర్యలకు సంబంధించిన నివేదికను పోలీసు ప్రధాన కార్యాలయంలోని పీజీఆర్ఎస్ సెల్‌కు పంపాలన్నారు. ప్రజా సమస్యలను పరిష్కరించటంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే సహించేదిలేదని హెచ్చరించారు. కార్యక్రమంలో డీఎస్పీ రామాంజనేయులు, పీజీఆర్ఎస్ సెల్ ఎస్ఐ శ్రీనివాస్, అధికారులు పాల్గొన్నారు.


అర్జీలు స్వీకరించి సమస్యలు అడిగి తెలుసుకుంటున్న ఎస్పీ తుషార్‌డూడి

మృతుల కుటుంబాలను పరామర్శించిన ఎమ్మెల్యే ఆనందబాబు

చుండూరు, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : మండలంలో ఇటీవల మృతి చెందిన సీనియర్ పార్టీ నాయకుల కుటుంబాలను మాజీ మంత్రి, ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు సోమవారం పరామర్శించారు. యడ్లపల్లికి చెందిన త్రిపురనేని శ్రీనివాసులు (94), చుండూరుకు చెందిన గుదేటి శేషిరెడ్డి (68) అనారోగ్య సమస్యలతో మృతి చెందారు. వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆనందబాబు మాట్లాడుతూ, తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచి వీరు గ్రామస్తులతో మమేకమై ఎన్నో అటుపోట్లు ఎదుర్కొని ఈ ప్రాంతంలో పార్టీ ఉన్నతికి కృషి చేశారని అన్నారు. పార్టీ అన్ని విధాలా అండగా ఉంటుందని తెలిపారు. బాపట్ల పార్లమెంటరీ కమిటీ ఉపాధ్యక్షుడు తమ్మా శివారెడ్డి, గుదేటి యల్లారెడ్డి, బాలకోటిరెడ్డి, ముక్కామల వేణు, గుదేటి బాలకృష్ణారెడ్డి, ఆలపాటి నాగభూషణం, అలపర్తి శ్రీనివాసరావు పాల్గొన్నారు.


పార్టీ నాయకుల కుటుంబాలను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే ఆనందబాబు

హిందూ చైతన్యవేదిక ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ

బాపట్ల, మార్చి10 (ఆంధ్రజ్యోతి) : హిందువులపై జరుగుతున్న ఏకపక్షదాడులను తీవ్రంగా ఖండిస్తూ నిరసన ర్యాలీ నిర్వహిస్తున్నట్లు హిందూచైతన్య వేదిక జిల్లా సంయోజక పుల్లగంటి శ్రీనివాస్ అన్నారు. గత ఆరునెలలుగా హిందువులపై ముస్లింలు దాడులు చేస్తున్నారని దీనిని నిరసిస్తూ సోమవారం బాపట్లలో ర్యాలీ నిర్వహించారు. పాతబస్టాండ్ కూడలిలో మానవహారంగా ఏర్పడి అనంతరం ర్యాలీగా కలెక్టరేట్‌కు వెళ్లి జాయింట్ కలెక్టర్ ప్రఖర్‌జైన్‌కు వినతిపత్రం అందజేశారు. రాయచోటిలో వీరభద్రస్వామి పార్వేట ఉత్సవంలో ముస్లింలు అకస్మాత్తుగా జొరబడి దాడులు చేశారని వారు ఆరోపించారు. ఈ కార్యక్రమంలో హిందూ చైతన్య వేదిక రాష్ట్ర సంయోజక్ అంబటి మారుతీరావు, జీవీఎల్ మోహన్‌గౌడ్, ఎస్.గణేష్‌బాలు, భరత్ తదితరులు పాల్గొన్నారు.



హిందూ చైతన్య వేదిక ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు, సభ్యులు

గత ప్రభుత్వ హామీలు అమలు చేయాలి

• రెవెన్యూ కార్యాలయం వద్ద అంగన్‌వాడీల నిరసన

భట్టిప్రోలు (కొల్లూరు), మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : గత ప్రభుత్వ హామీలు అమలు చేయాలని కోరుతూ విజయవాడలో తలపెట్టిన మహాధర్నాకు మద్దతుగా భట్టిప్రోలులో అంగన్‌వాడీ కార్యకర్తలు సోమవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. సీఐటీయూ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కార్యకర్తలు ర్యాలీగా రెవెన్యూ కార్యాలయం వద్దకు వెళ్లి అక్కడ బైఠాయించి తమ నిరసన వ్యక్తం చేశారు. సీఐటీయూ మండల కార్యదర్శి జి.సుధాకర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వెంటనే అంగన్‌వాడీల ఆందోళన పరిగణనలోకి తీసుకుని వారి సమస్యలు పరిష్కరించడంతో పాటు పెరిగిన ధరలకు అనుగుణంగా వేతనాలు పెంపు చేసి కార్యకర్తలకు ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలన్నారు. అనంతరం వినతులతో కూడిన పత్రాన్ని తహసీల్దార్ శ్రీనివాసరావుకు అందజేశారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ నాయకులు రమాదేవి, చల్లమ్మ, రూపారాణి, సూర్యలక్ష్మి, మమత, రజిత, పుష్పలత, ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు మనోజ్‌కుమార్, కౌలు రైతు సంఘ నాయకులు జి.నాగరాజు, చేనేత కార్మిక సంఘం నాయకులు సత్యనారాయణ నిరసన కార్యక్రమానికి మద్దతు తెలిపారు.


తహసీల్దార్‌కు వినతి పత్రం అందిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు, సీఐటీయూ నాయకులు

వీధి కుక్కల శస్త్ర చికిత్సాలయం ఏర్పాటు

బాపట్ల, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : నానాటికి వీధి కుక్కలు ఎక్కువైపోయి ప్రజలు పడుతున్న ఇబ్బందుల దృష్ట్యా మున్సిపల్ అధికారులు స్పందించి కుక్కల సంతానోత్పత్తి నియంత్రించేందుకు శస్త్రచికిత్సాలయం నిర్మించారు. రైలుపేటలోని హిందూ శ్మశాన వాటిక సమీపంలో ఏర్పాటు చేసిన చికిత్సాలయంను సోమవారం డీఈ కృష్ణారెడ్డి పరిశీలించారు. అక్కడ చేయాల్సిన ఏర్పాట్లు గురించి సిబ్బందితో చర్చించారు. త్వరలో అనుభవం కలిగిన వైద్యులతో కుక్కలకు శస్త్ర చికిత్స చేయనున్నట్లు తెలిపారు.



శస్త్ర చికిత్సాలయాన్ని పరిశీలిస్తున్న మున్సిపల్ డీఈ కృష్ణారెడ్డి తదితరులు

ఆకలి కేకలు

గుంటూరు (విద్య) మార్చి 10 (ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్ రోడ్డులోని (రమేష్ ఆస్పత్రి పక్కన), హయ్యర్ హాల్ కాంపౌండ్‌లో సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో రెండు కళాశాల హాస్టల్స్ నిర్వహిస్తున్నారు. మొదటి హాస్టల్‌లో 200 మంది, రెండో హాస్టల్లో 198 మంది ఎస్సీ విద్యార్థులు వసతి పొందుతున్నారు. ఇంటర్ నుంచి డిగ్రీ వరకు నగరంలోని కళాశాలల్లో విద్యాభ్యాసం చేస్తున్నారు. ఈ హాస్టల్స్‌లో కొంత కాలంగా భోజనం సక్రమంగా అందడం లేదు. దొడ్డు బియ్యంతో తయారు చేసిన చిమిడి పోయిన అన్నం, నాణ్యతలేని కూరలు వడ్డిస్తుండటంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇలా నిత్యం ఆకలితో అలమటిస్తున్న విద్యార్థులు ఎన్ని సార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకునే వారే కరువయ్యారు. దీంతో కొంతమంది విద్యార్థులు హాస్టల్ భోజనం తినలేక రైస్ కుక్కర్లను హాస్టల్స్‌కు తీసుకువచ్చి భోజనం వండుకుని కర్రీ పాయింట్స్ నుంచి కూరలు తెచ్చుకుని తింటూ కాలం వెళ్లదీస్తున్నారు. నగరం నడిబొడ్డున సాక్షాత్తూ జిల్లా అత్యున్నత అధికారుల కార్యాలయం రోడ్డులోనే ఈ తంతు జరుగుతున్నా, సంబంధిత అధికారులకు చీమకుట్టినట్లయినా లేదు.

బోగస్ హాజరుతో నిధుల స్వాహా

సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ రెండు హాస్టల్స్‌లో ఉన్న ఒక్కో విద్యార్థికి నెలకు రూ. 1600 వరకు ప్రభుత్వం చెల్లిస్తుంది. ఇలా నెలకు రూ. 7 లక్షలపైగా మెనూ చార్జీల కింద, ఇతర నిర్వహణ చార్జీల కింద మరో రూ. 1.50 లక్షల చెల్లిస్తున్నారు. వాస్తవంగా ఉన్న విద్యార్థుల హాజరు కంటే ఎక్కువ చూపి బోగస్ హాజరు నమోదు చేసి నెలకు లక్షల్లో బిల్లులు పెడుతున్నారు. వచ్చిన సొమ్ములో ఉన్నతాధికారికి వాటాలు పంపుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. దీనిపై ఇటీవల ఏఎస్‌డబ్ల్యూవో బహిర్గతమైంది. సదరు అధికారి పరిశీలనకు వెళ్లిన సమయంలో రైస్ కుక్కర్లో విద్యార్థులు అన్నం వండుకుంటూ కనిపించారు. మరోవైపు కొంతమంది విద్యార్థులు సమీపంలోని హిందూ కళాశాల వద్ద ఉన్న అన్న క్యాంటీన్లో భోజనం, అల్పాహారం చేస్తున్నట్లు గుర్తించి ఆ అధికారి తీవ్ర ఆవేదనకు గురయ్యారు. ఈ విషయంపై ఉన్నతాధికారులకు ఆధారాలతో సహా సమగ్ర నివేదిక అందజేసినా చర్యలు మాత్రం శూన్యం. కళాశాల హాస్టల్ వార్డెన్లు భారీ మొత్తంలో పైస్థాయిలో ఓ అధికారికి ముడుపులు చెల్లిస్తున్నారనీ, అందుకే వారిపై ఈగ వాలనీయడం లేదని విద్యార్థి సంఘాలు ఆరోపిస్తున్నాయి.

- ఎస్సీ కళాశాల హాస్టల్స్‌లో నాణ్యతలేని భోజనం
- రైస్ కుక్కర్లతో విద్యార్థులే వండుకుంటున్న వైనం
- కొందరికి అన్న క్యాంటీనే ఆధారం
- బోగస్ హాజరుతో అక్రమాలు
- పట్టించుకోని ఉన్నతాధికారులు

గుంటూరు

నగరం నడిబొడ్డున ఉన్న సాంఘిక సంక్షేమ శాఖ హాస్టల్ నుంచి ఓ విద్యార్థిని కిడ్నాప్ చేసి తీసుకెళ్లి రెండు రోజులు నిర్బంధించినా పట్టించు కోరు... జిల్లా అత్యున్నత అధికారులు నివాసం ఉండే బంగ్లాల సమీపంలోని హాస్టల్లో ఓ విద్యార్థిని గర్భం దాల్చి బిడ్డకు జన్మనిచ్చినా... అధికారులు కళ్లు తెరవరు... మరోవైపు హాస్టల్స్ లో నాణ్యతలేని భోజనం తినలేక విద్యార్థులు ఆకలి కేకలతో అలమటిస్తున్నా స్పందించరు.. ఇదీ నగరంలోని సాంఘిక సంక్షేమ శాఖ హాస్టల్స్‌లో నెలకొన్న దయనీయ పరిస్థితులు.



ఓ గదిలో సామాన్లతోపాటు ఉన్న రైస్ కుక్కర్



ఉన్నతాధికారి రూటే సపరేటు

సాంఘిక సంక్షేమ శాఖలో ఓ అత్యున్నత అధికారి రూటే సపరేటు అన్నచందంగా సాగుతోంది. ఆయన జిల్లాకు వచ్చి ఐదు సంవత్సరాలు దాటింది. ఆయనపై ఫిర్యాదుల పరంపర కొనసాగుతున్నా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవడం లేదని విద్యార్థి సంఘాలు ఆరోపిస్తున్నాయి. ఎస్సీ బ్యాక్‌లాగ్ పోస్టుల నియామకంలో అక్రమాలు, ఉద్యోగుల బదిలీలు, పదోన్నతుల్లో భారీ వసూళ్ల, కీలకమైన పోస్టింగ్ విషయంలో అక్రమాలకు పాల్పడినట్లు ఇప్పటికే కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. సాంఘిక సంక్షేమ శాఖ హాస్టల్స్‌లో ఇటీవల చోటు చేసుకున్న వరుస సంఘటనలపై కూడా చర్యలు లేవని చెబుతున్నారు.

ఆరోపణలు ఉన్న వెల్ఫేర్ ఆఫీసర్‌కు కీలక పోస్టు...

హయ్యర్‌హాల్ హాస్టల్‌లో పనిచేసే ఓ హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్‌పై అనేక ఫిర్యాదులు ఉన్నాయి. గుంటూరుతో పాటు, బాపట్ల, పల్నాడు ప్రాంతాల్లో పనిచేసిన ఆయన ప్రతిచోట అక్రమాలకు, విధినిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తున్నారని విద్యార్థి సంఘాల నాయకులు చెబుతున్నారు. ఇప్పటికే నాలుగు సార్లు సస్పెండ్ అయినా తీరుమార లేదని ఆశాఖలో సిబ్బందే చెబుతున్నారు. గతంలో జడ్పీలో పనిచేసిన ఓ కీలకమైన అధికారి బంధువైన మహిళను వేధించినట్లు ఫిర్యాదులు ఉన్నాయి. ఇన్ని ఆరోపణలు ఉన్నా, హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్‌కు కీలక మైన హాస్టల్‌లో పోస్టింగ్ ఇచ్చారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు.

అస్తవ్యస్తంగా హాస్టల్స్

ఉన్నతాధికారుల నిర్లక్ష్యం వలన సాంఘిక సంక్షేమ శాఖ హాస్టల్స్ అస్తవ్యస్తంగా మారాయి.

- ఏడాది క్రితం జూట్‌మిల్లు సమీపంలోనే విద్యార్థినుల కళాశాల హాస్టల్ నుంచి ఓ విద్యార్థిని వైసీపీ కార్యకర్తలు కిడ్నాప్ చేసి రెండు రోజులు నిర్బంధించారు. దీనిపై ఎటువంటి చర్యలు తీసుకున్నారో ఇప్పటి వరకు తెలియదు.
- ఆర్నెల్లు క్రితం సాక్షాత్తూ కలెక్టర్, ఎస్పీ, ఐజీ బంగ్లాల రోడ్డులో ఉండే ఓ కళాశాల హాస్టల్‌లో ఓ విద్యార్థిని గర్భం దాల్చి బిడ్డకు జన్మనిచ్చినా ఆ విషయం ఎనిమిది నెలల వరకు అధికారులకు తెలియలేదంటే నిర్లక్ష్యం ఏ స్థాయిలో ఉందో అవగతం చేసుకోవచ్చు.
- కలెక్టర్ బంగ్లా రోడ్డులోనే రెండు హాస్టల్స్‌లో నిత్యం విద్యార్థులు ఆకలి కేకలతో అలమటిస్తున్నా పట్టించుకునే వారే కరువయ్యారు. చివరకు విద్యార్థి సంఘాల ఫిర్యాదుతో ఓ అధికారి విచారణ చేపట్టి ఉన్నతాధికారులకు నివేదిక అందజేసినా చర్యలు లేవు. దీనికితోడు నివేదిక ఇచ్చిన అధికారిపైనే సదరు హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్లు ఎదురుదాడికి దిగి ఆరోపణలు చేస్తున్నారు. దీనికి సాంఘిక సంక్షేమ శాఖలోని ఓ ఉన్నతాధికారి వత్తాసు పలుకుతున్నారన్న ఆరోపణలు ఉన్నాయి.



ఇంటి నుంచి తెచ్చుకున్న రైస్ కుక్కర్ చూపుతున్న విద్యార్థి

చిన్న శేష వాహనంపై ఊరేగిన శ్రీవారు



శేష వాహనంపై దర్శనమిచ్చిన నృసింహస్వామి

మంగళగిరి, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళాద్రి శ్రీలక్ష్మీనృసింహస్వామి సోమవారం ఉదయం చిన్న శేష వాహనంపై పురవీధుల్లో విహ రించారు. ఈ ఉత్సవానికి మంగళగిరి పట్టణానికి చెందిన దేవతి భగవన్నారాయణ, పద్మజ దంపతులు కైంకర్యపరులుగా వ్యవహరించారు. స్వామివారు సోమవారం రాత్రి సింహ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. దేవస్థానం మాడవీధుల్లో విహరించిన అనంతరం మెయిన్ బజారు మీదుగా మిద్దె సెంటరు వరకు గ్రామోత్సవం సాగింది. ఈ ఉత్సవానికి మాల్యవంతం వెంకట కృష్ణమాచార్యులు జ్ఞాపకార్థం ఆయన మనుమలు కైంకర్యపరులుగా వ్యవహరించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి అన్నపురెడ్డి రామకోటి రెడ్డి ఉత్సవ ఏర్పాట్లను పర్యవేక్షించారు. శ్రీలక్ష్మీ నరసింహస్వామి వార్ల భక్త బృందం కమిటీ ట్రస్టు ఆధ్వర్యంలో మిద్దె సెంటర్లోని శ్రీప్రపత్తి ఆంజనేయస్వామి దేవస్థానం వద్ద భక్తులకు తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు.

దుగ్గిరాల యార్డుకు కొత్త పసుపు కళ

- క్వింటాల్‌కు రూ.11,111 పలికిన ధర



దుగ్గిరాల, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): దుగ్గిరాల పసుపు మార్కెట్ యార్డు సోమవారం కొత్తపసుపుతో కళకళలాడింది. మహిళా హమాలీలు కాటాలకు పసుపు, కుంకుమలు పెట్టి పూజ చేసిన అనంతరం వేలం ప్రారంభించారు. డీడీ ఎస్ శ్రీనివాస రావు, పలువురు వ్యాపారులు పూజ కార్యక్రమానంతరం వేలంలో పాల్గొన్నారు. ఏటా మార్చి నెలాఖరులో వచ్చే కొత్తపంట ఈఏడాది 10వ తేదీనే రావడంతో రైతుల్లో ధరపై ఆశలు రేకెత్తుతున్నాయి. వారం రోజు లుగా క్వింటాల్ పసుపు రూ.10వేల లోపు ధర పలుకుతుండగా సోమవారం వచ్చిన కొత్తపసుపు క్వింటాల్‌కు రూ.11,111 ధర పలకడంపై రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. వేలంలో 288 బస్తాల పసుపును రైతులు వ్యాపారులకు విక్రయించారు. కొమ్ము లు, కాయ ఒకేధరలు పలికాయి. క్వింటాల్‌కు కనిష్టధర రూ.8,000, గరిష్టధర రూ.11,111, మోడల్‌ధర రూ.10,601 పలికాయి.




యార్డులో పూజలు జరుపుతున్న మహిళా హమాలీలు

మహిళా సాధికారతకు ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుంది

- ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్

గుంటూరు, మార్చి 10(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మహిళల సాధికారత కోసం కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తుందని ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ అన్నారు. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్రాంతీయ కార్యాలయం జీటీ రోడ్డులోని ఐటీఏ కల్యాణ మండపంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం -2025 నిర్వహించింది. ఈ సందర్భంగా ఆలపాటి మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో తమ ప్రతిభను చాటుకోవాలని, అందుకు అనుగుణంగా ప్రభుత్వాలు ప్రోత్సాహకాలను కూడా అందజేస్తున్నాయన్నారు. బ్యాంకు రీజనల్ హెడ్ ఎస్ జవహర్ మహిళల బహుముఖ పాత్రలను వివరిస్తూ ప్రశంసించారు. అలాగే డాక్టర్ జయలక్ష్మీదేవి బ్యాంకు మహిళా ఉద్యోగులకు, మహిళా పారిశ్రామికవేత్తలకు శుభాకాంక్షలు తెలిపారు. మహిళల స్వయం సమృద్ధి కోసం బ్యాంకులు మరింత సహాయ సహకారాలను పెంచాలని కోరారు. బ్యాంకు ఆధ్వర్యంలో మహిళా పారిశ్రామికవేత్తలకు రూ. 150కోట్ల రుణాలను పంపిణీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో కస్టమర్లు, ప్రాంతీయ కార్యాలయ సిబ్బంది ఉన్నారు.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ తదితరులు

బీఈడీ ప్రశ్నపత్రాల లీకేజీ కేసులో పది మంది అరెస్టు

- వినుకొండ వివేకానంద కళాశాల కరస్పాండెంట్‌దే కీలకపాత్ర
- ఎస్పీ సతీష్ కుమార్ వెల్లడి



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ సతీష్‌కుమార్, డీఎస్పీ మురళీ కృష్ణ, సీఐ నారాయణస్వామి, వెనుక నిందితులు

గుంటూరు, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : ఆచార్య నాగార్జున యూనివర్సిటీ పరిధిలో జరుగుతున్న బీఈడీ పరీక్షలకు సంబంధించి ఈ నెల ఏడున ప్రశ్నపత్రం లీకేజీ ఘటనకు వినుకొండ వివేకానంద కళాశాల కరస్పాండెంట్, ఛైర్మన్ అయిన సయ్యద్ రఫిక్ అహ్మద్ కీలక సూత్రధారిగా ఎస్పీ సతీష్ కుమార్ తెలిపారు. ఈ కేసులో కరస్పాండెంట్ రఫిక్ అహ్మద్‌తో పాటు కళాశాల ప్రిన్సిపల్ ధూపాటి సురేష్ కుమార్, కంప్యూటర్ ఆపరేటర్ ధారా స్వర్ణ రాజ్ మరో ఏడుగురు ఒడిశా రాష్ట్రానికి చెందిన ఏజెంట్లు, విద్యార్థులను అరెస్టు చేసినట్లు ఎస్పీ సతీష్ కుమార్ వెల్లడించారు. ఈ మేరకు సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నిందితులను మీడియా ఎదుట హాజరు పరిచి వివరాలు వెల్లడించారు. ఎస్పీ కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. ఒడిశా రాష్ట్రం మొత్తం మీద ఆరువేల బీఈడీ సీట్లు ఉండగా ఒక నాగార్జున యూనివర్సిటీ పరిధిలోనే ఆరువేల వరకు బీఈడీ సీట్లు ఉన్నాయన్నారు. అంతేకాకుండా ఇక్కడ బీఈడీకి ఆదరణ తగ్గడంతో పాటు ఒడిశాలో డిమాండ్ ఎక్కువగా ఉండడంతో అక్కడి నుంచి పెద్ద సంఖ్యలో విద్యార్థులు ఆచార్య నాగార్జున యూనివర్సిటీ పరిధిలోని బీఈడీ కళాశాలలో ప్రవేశం కోసం ఎగబడుతున్నారు. దీంతో ఒడిశాకు చెందిన కొన్ని కోచింగ్ సెంటర్ల నిర్వాహకులు ఏజెంట్లుగా మారి ఇక్కడ ఒడిశా విద్యార్థులకు అడ్మిషన్ కల్పిస్తున్నారు. ఆయా విద్యార్థుల వద్ద లక్ష నుంచి లక్షన్నర వరకు ఏజెంట్లు వసూలు చేస్తున్నారు. ఇక్కడ కళాశాల యాజమాన్యాలకు రూ. 70 వేల వరకు చెల్లిస్తున్నారు. ఆయా విద్యార్థులకు అక్కడే తరగతులు నిర్వహిస్తూ ఇక్కడ మాత్రం పరీక్షలు రాయిస్తున్నారు. ఈ క్రమంలో సయ్యద్ రఫిక్ అహ్మద్ వినుకొండలో శ్రీ వివేకానంద కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్, నవ్య చైతన్య కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్, అమరావతిలో ఆజాద్ కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్ నిర్వహిస్తుండగా ఆయన కూతురు పేరుతో వినుకొండలో ఆలీ కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్ నిర్వహిస్తున్నారు. రఫిక్ అహ్మద్ నిర్వహిస్తున్న బీఈడీ కళాశాలలో ఎక్కువ మంది ఒరిశా విద్యార్థులు ప్రవేశం పొందారు. ఈ నేపథ్యంలో వచ్చే విద్యా సంవత్స రంలోనూ ఒడిశా నుంచి ఎక్కువమంది విద్యార్థులు తమ కళాశాలలో అడ్మిషన్ పొందేందుకు గాను ఆయా విద్యార్థుల ఉత్తీర్ణత శాతం పెంచడం, అదేవిధంగా ఆయా ఏజెంట్లను సంతృప్తి పరచడం కోసం బీడీ ప్రశ్నపత్రాలను లీకేజ్ చేసేందుకు రఫిక్ అహ్మద్ పథకం రూపొందించాడని ఎస్పీ తెలిపారు. అదే సమయంలో ఆచార్య నాగార్జున యూనివర్సిటీ అధికారులు తీసుకున్న అనాలోచిత నిర్ణయం కూడా రఫిక్ అహ్మద్‌కు కలిసి వచ్చింది. సాధారణంగా రెండు, మూడు రకాల ప్రశ్న పత్రాలను తయారుచేసి వాటికి ప్రత్యేకంగా కోడ్ ఇచ్చి సీల్ వేసి సంబంధిత పరీక్షా కేంద్రాలకు పంపుతారు. ఐదు నిమిషాల ముందు ఏ కోడ్ పేపర్ విద్యార్థులకు ఇవ్వాలనేది యూనివర్సిటీ ఉన్నతాధికారులు సమాచారం ఇస్తారు. దీంతో ప్రశ్నపత్రాల లీకేజీకి దాదాపు అవకాశం ఉండదు. అయితే ఈ దఫా ప్రశ్నపత్రాలను పీడీఎఫ్ రూపంలో సీడీలలో ముందుగానే కళాశాలకు పంపారు. పరీక్షకు 40 నిమిషాల ముందుగా ఆయా సీడీలకు పాస్‌వర్డ్ తెలియజేశారు. దీంతో ఆయా కళాశాల యాజమాన్యాలు, ప్రిన్సిపల్స్ తమకు వచ్చిన సీడీలోని పీడీఎఫ్‌ను పాస్‌వర్డ్ ఉపయోగించి ఓపెన్ చేసుకొని వాటిని ప్రింట్ తీసి పరీక్షా కేంద్రంలో విద్యార్థులకు ఇవ్వాలని నిర్ణయించారు. కేవలం ప్రశ్న పత్రాల ప్రింటింగ్ ఖర్చు తగ్గుతుందనే దురుద్దేశంతో చేసిన ఈ అనాలోచిత నిర్ణయంతో 40 నిమిషాలకు ముందుగానే ప్రశ్నపత్రం తాలూకా నకళ్ల జిరాక్స్ సెంటర్లలో దర్శనమిచ్చాయి. ఈ క్రమంలో ఈ నెల 7న జరగాల్సిన పర్స్పెక్టివ్స్ ఇన్ చైల్డ్ డెవలప్మెంట్ పరీక్షకు సంబంధించిన సీడీని వినుకొండలోని వివేకానంద కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్ కరస్పాండెంట్ రఫిక్ అహ్మద్ తన కళాశాల కంప్యూటర్ ఆపరేటర్ అయిన ధార స్వర్ణరాజ్‌కు ఇచ్చారు. ప్రిన్సిపల్ ధూపాటి సురేష్ కుమార్, స్వర్ణరాజ్ ఇరువురు కలిసి రెండు గంటలకు జరగాల్సిన పరీక్షకు సంబంధించిన ప్రశ్నపత్రాన్ని ఒంటిగంటా 21 నిమిషాలకు ఒడిశాకు చెందిన ఏజెంట్ల సెల్‌ఫోన్ వాట్సాప్‌కు పంపారు. ఆయా ఏజెంట్లు తమ విద్యార్థులకు పంపగా వారు ఏకంగా గ్రూపులోనే ప్రశ్నపత్రాన్ని ఫార్వర్డ్ చేశారు. దీంతో పరీక్షకు 40 నిమిషా లకు ముందుగానే బీఈడీ ప్రశ్నాపత్రం వాట్సాప్ గ్రూపుల్లో హల్‌చల్ చేసింది. ఈ విషయం విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ దృష్టికి వెళ్లడంతో ఆయన ప్రశ్నపత్రం లీకేజీ ఘటనపై విచారణకు ఆదేశించారు. దీనిపై ఆచార్య నాగార్జున యూనివర్సిటీ పీజీ అండ్ ప్రొఫెషనల్ కోర్సుల పరీక్షల కోఆర్డినేటర్ మన్నవ సుబ్బారావు ఫిర్యాదు మేరకు పెదకాకాని పోలీసులు కేసు నమోదు చేశారు. వివేకానంద బీఈడీ కళాశాల కరస్పాండెంట్ రఫిక్ అహ్మద్, ప్రిన్సిపల్ సురేష్ కుమార్, కంప్యూటర్ ఆపరేటర్ స్వర్ణ రాజ్‌లు ప్రశ్నపత్రాన్ని ఒడిశాకు చెందిన ఏజెంట్లకు పంపారు. ఒడిశాకు చెందిన ఏజెంట్ ధీరేన్ కుమార్ సాహూ దానిని ఒడిశాకు చెందిన విద్యార్థులు ప్రియ భత్రో గౌడయ్, మిలాన్ తృప్తి లకు పంపాడు. దీంతో పోలీసులు ధీరేన్ కుమార్ సెల్‌ఫోన్ వాట్సాప్ ఐడి నుంచి దర్యాప్తు చేయగా ఇందులో వినుకొండ లోని శ్రీ వివేకానంద కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్ నిర్వాహకులు కీలకపాత్ర పోషించినట్లు తేలింది. కాగా ఈ ఘటనపై జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ ఆదేశాల మేరకు నార్త్ డీఎస్పీ సిహెచ్ మురళీకృష్ణ ఆధ్వర్యంలో పెదకాకాని సీఐ టీపీ నారాయణస్వామి అన్ని కోణాల్లో సమగ్ర విచారణ జరిపి ఇందుకు బాధ్యులైన వివేకానంద బీఈడీ కళాశాల కరస్పాండెంట్ సయ్యద్ రఫిక్ అహ్మద్ తో పాటు నూజెండ్ల మండలం పెద్దవరం గ్రామానికి చెందిన కళాశాల ప్రిన్సిపల్ ధూపాటి సురేష్ కుమార్, వినుకొండకు చెందిన కళాశాలలోని కంప్యూటర్ ఆపరేటర్ ద్వారా స్వర్ణరాజ్, ఏజెంట్లు అయిన ఒడిశా రాష్ట్రంలోని అంగుల్ పట్టణానికి చెందిన సంతోష్ కుమార్ సాహూ, బరంపురం మండలం లంజీపల్లికి చెందిన బిష్ణు ప్రసాద్ పత్రో, నిస్సిమ్ కోయిల్ మండలం పాయకాపూర్ గ్రామానికి చెందిన సుఖాంత్ బెహరా, కోరాపూర్ జిల్లా టైపరిగూడకు చెందిన పురుషోత్తం ప్రధాన్, నయాపల్లికార్దకు చెందిన ధీరేన్ కుమార్ సాహూ, అదేవిధంగా బీఈడీ విద్యార్థులైన ఒడిశా రాష్ట్రంలోని భైరవ చొక్కా గ్రామానికి చెందిన ప్రియాబత్రో గోడయ్, రాయగడ జిల్లా కటికల్ గ్రామానికి చెందిన మిలాన్ తృప్తి అనే పదిమందిని అరెస్టు చేశారు. వారి నుంచి 13 సెల్ ఫోన్లు సీజ్ చేసినట్లు ఎస్పీ తెలిపారు.

ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేయాలి

- పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్

పెదకూరపాడు, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): పెదకూరపాడు నియోజకవర్గంలో పర్యావరణ, కాలుష్య రహిత ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ కోరారు. వెలగపూడిలోని సచివాలయంలో సోమవారం జరిగిన అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో ఎమ్మెల్యే ప్రవీణ్ నియోజకవర్గంలో నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి కల్పనపై మాట్లాడారు. పెదకూరపాడు మండలంలోని గారపాడులోని 300 ఎకరాల ఉమ్మడి భూమిలో ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటు చేయాలని కోరారు. ఇక్కడి రైతులు మిరప, పత్తి, వరిని ఎక్కువగా సాగు చేస్తుంటారని, ఈ ప్రాంతం ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్‌కు అనువుగా ఉంటుందన్నారు. వ్యవసాయం పై ఆధారపడి జీవించే యువకులకు ఉద్యోగ, ఉపాధి లభించే అవకాశం ఉంటుందని ప్రవీణ్ అన్నారు.

పరిశ్రమల శాఖ మంత్రికి వినతి..

నిరుద్యోగ యువతకు ఉపాధి ఉద్యోగ కల్పనలో భాగంగా నియోజక వర్గంలో ఇండస్ట్రియల్‌పార్కు ఏర్పాటు చేయాలని కోరుతూ ఎమ్మెల్యే ప్రవీణ్ సోమవారం రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్‌ను కలిసి వినతి పత్రం అందించారు.



మంత్రి భరత్‌కు వినతి పత్రం అందిస్తున్నఎమ్మెల్యే ప్రవీణ్

డీ-పట్టాలతోనే సీలింగ్ భూముల క్రమబద్ధీకరణకు ఆటంకం

- స్థలాల ధరలు పడిపోతాయంటున్న యజమానులు
- నామమాత్రంగా ఫీజు నిర్ణయించి రిజిస్ట్రేషన్ చేస్తేనే మేలని వాదన



గుంటూరు, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): సీలింగ్ భూముల క్రమబద్ధీకరణకు రాష్ట్ర ప్రభుత్వం కల్పించిన మరో అవకాశం విజయవంతం కావాలంటే కొన్ని సవరణలు తప్పనిసరన్న అభిప్రాయం వివిధ వర్గాల ద్వారా వ్యక్తమౌతున్నది. ముఖ్యంగా 150 చదరపు గజాల లోపు భూములకు డీ-పట్టా మంజూరు చేస్తామని ప్రభుత్వం నిబంధన పెట్టింది. దీని వలన పదేళ్ల వరకు ఆ స్థలాన్ని విక్రయించుకొనే అవకాశం ఉండదు. ఈ కారణంగా చాలామంది భూయజమానులు సీలింగ్ పరిధిలో ఉన్న తమ భూములను క్రమబద్ధీకరించుకునేందుకు ముందుకు రావడం లేదు. గత ప్రభుత్వం తీసుకొచ్చిన జీవోనే ప్రస్తుత కూటమి ప్రభుత్వం అమలు చేస్తూ కేవలం గడువు మాత్రమే పొడిగించడం వలన ఎలాంటి ఉపయోగం లేదన్న అభిప్రాయం వినవస్తోన్నది. ఈ నేపథ్యంలో జిల్లాకు చెందిన మంత్రులు, ఎమ్మెల్యేలు ఈ విషయాన్ని అసెంబ్లీ ప్రశ్నోత్తరాలు, జీరో అవర్‌లో చర్చకు లేవనెత్తితే కొంత మేలు జరిగే అవకాశం ఉన్నది.

పట్టణ భూపరిమితుల చట్టం 1976 ప్రకారం ప్రభుత్వ పరిధిలోకి వచ్చినటువంటి సీలింగ్, మిగులు భూముల్లో ఉన్న ఇళ్లను క్రమబద్ధీకరించుకునేందుకు ఈ ఏడాది ఆఖరు వరకు ప్రభుత్వం అవకాశం కల్పిం చింది. దీని వలన 150 చదరపు గజాల వరకు అన్ని అర్హతలు కలిగిన వారికి ఉచితంగా డీ-పట్టా మంజూరు చేయడం జరుగుతుంది. అయితే ఇక్కడే అసలు సమస్య ఉన్నది. సీలింగ్ భూమి అయినప్పటికీ ఏదో ఒక సర్వే నంబరుతో భూ అనుభవదారులు ఇప్పటికే రిజిస్ట్రేషన్ చేయించుకొన్నారు. ఈ నేపథ్యంలో ఇప్పుడు వాటికి డీ-పట్టా తీసుకొంటే మార్కెట్ విలువ పతనం అయిపోతుంది. గుంటూరు జిల్లా పరిధిలో 3600 సీలింగ్ భూములున్నట్లు అంచనా వేస్తున్నారు. క్రితంసారి అవకా శం కల్పించినప్పుడు 800 మంది వరకు దరఖాస్తు చేసుకొన్నారు. వాటిల్లో 300లకు పైగా విచారణ పూర్తయి ప్రభుత్వానికి వెళ్లాయి. కాగా ప్రస్తుతం 2800 వరకు ఉన్నాయి. వీటిల్లో 1700 మంది భూములు 150 చదరపు గజాల లోపే ఉన్నాయి. వీళ్లంతా క్రమబద్ధీకరించుకోవడానికి ముందుకు రావడం లేదు. ఇందుకు కారణం ప్రస్తుతం వాళ్ల భూములు రిజిస్ట్రేషన్ అయి ఉండటమే. ఈ నేపథ్యంలో వీళ్లకు కూడా ఎంతో కొంత ఛార్జీలు నిర్ణయించి రిజిస్ట్రేషన్ చేస్తేనే ముందుకొస్తారు. కాగా 150 నుంచి 300 చదరపు గజాల వరకు బేసిక్ విలువలో 15 శాతం చెల్లించుకొని రిజిస్ట్రేషన్ చేస్తారు. 300 నుంచి 500 చదరపు గజాల వరకు బేసిక్ విలువలో 30 శాతం, 500 చదరపు గజాల కంటే ఎక్కువ ఉంటే 100 శాతం బేసిక్ విలువ చెల్లించాలి. వీళ్లందరికి కన్వేయన్స్ డీడ్స్ ఇస్తారు. అలానే భూములను సొంత ఖర్చులతో రిజిస్ట్రేషన్ చేయించుకొనే వెసులుబాటు ఉంటుంది. అంతేకాకుండా వాటిని నిషేధిత భూముల జాబితా నుంచి కూడా తొలగిస్తారు. అయితే ఈ వెసులుబాటు 150 చదరపు గజాల లోపు వాళ్లకి కల్పించకపోవడం వలన పెద్దగా భూయజమానులు ముందుకొచ్చే పరిస్థితి జిల్లాలో లేదు.

దిగజారిన మిర్చి ధర

- లబోదిబోమంటున్న రైతులు
- ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకోలు



కడవకుదురు ప్రాంతంలో సాగు చేస్తున్న మిర్చి తోటలు

చినగంజాం, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : మిర్చి ధర రోజు రోజుకూ దిగజారుతుండడంతో మిర్చి రైతులు లబోదిబోమంటున్నారు. గత ఏడాది మిరప కాయలకి మంచి ధర వచ్చి రైతులు లాభాలను ఆర్జించారు. ఈ ఏడాది కూడా లాభాలు ఆర్జించవచ్చని ఆశించిన రైతులకు భంగపాటు ఎదురైంది. గతంలో కంటే మిర్చి సాగు అధికమైంది. మండలంలోని మోటుపల్లి, చినగంజాం, కడవకుదురు, రాజు బంగారుపాలెం, పెదగంజాం తదితర గ్రామాల్లోని ఇసుక భూముల్లో రైతులు మిర్చి పంటను సాగు చేస్తున్నారు. గతంలో లాభాలు ఆర్జించిన రైతులను చూసి మనకు కూడా బాగా లాభాలు వస్తాయని ఆశించి వేరుశనగ వేసే భూమిని సైతం మిర్చి తోటలు వేశారు. హైబ్రిడ్ మిర్చి రకం కావడంతో దిగుమతులు కూడా ఆశాజనకంగానే ఉన్నాయి. అంగట్లో అన్ని ఉన్నా అల్లుడి నోట్లో శని అన్నట్లు మిర్చి రైతుల పరిస్థితి మారింది. దిగుబడులు బాగా ఉన్నా రేటు సక్రమంగా లేకవోవడంతో రైతుల పరిస్థితి దీనంగా మారింది. గతంలో కిలో ధర రూ.20 ఉండగా నేడు కిలో రూ.11లకే పడిపోవడంతో కోత కూలికి కూడా రావడం లేదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఒక మిరుప మొక్క ఖరీదు రూపాయన్నర ఉంది. కౌలు, మొక్కలు వాటి సంరక్షణ, క్రిమి సంహారాలు, కూలి రేట్లు తడిసిమోపుడు అవుతున్నాయని, పంట చేతికి వచ్చే సరికి ధర తగ్గుదల వచ్చిందని రైతులు వాపోతున్నారు. కొనబోతే కొరివి, అమ్మబోతే అడవిలా రైతుల పరిస్థితి దాపురించిందని రైతులు అంటున్నారు. ఎకరానికి సాగు ఖర్చులు రూ.70-80వేల వరకు అవుతున్నాయని, మార్కెటులో రేటు లేకపోవడంతో, ఇలాంటి పరిస్థితి ఉండడంతో రైతులు దిగాలు చెందుతున్నారు. మిర్చి రైతులను ప్రభుత్వమే ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

కోత కూలి కూడా రావడం లేదు



మిరుపకాయలు కిలో ధర రూ.8ల నుంచి రూ.11 ఉండడంతో కోత ఖర్చు కూడా రావడం లేదని అన్నారు. మిరుప మొక్కకు ఉన్న డిమాండ్ కాయకు లేకుండా పోయిందని వాపోయారు.పంట మార్పిడి చేసిన ఫలితం లేకుండా పోయిందని అన్నారు.

- పిల్లల పండు, రైతు, కడవకుదురు

ప్రభుత్వమే ఆదుకోవాలి



ప్రభుత్వమే గిట్టుబాటు ధర కల్పించి రైతులను ఆదుకోవాలి. గతంలో వేరుశనగ వేసే భూముల్లో వేరుశనగ కంటే మంచి లాభాలు ఆశించి మిరుప పంట వేశాం. గిటుబాటు ధర లేకపోవడంతో నష్టపోయాం.

- నాగబోయిన ఆదాం, రైతు, కడవకుదురు

క్రీడాకారుడు గోపీచంద్ అమ్మమ్మ మృతి



అమ్మమ్మ మృతదేహానికి నివాళులర్పిస్తున్న గోపించద్, కుటుంబీకులు

ఇంకొల్లు, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : ఇండియా బ్యాడ్మింటన్ కోచ్, తెలంగాణ రాష్ట్ర బ్యాడ్మంటన్ అసోసియేషన్ కార్యదర్శి పుల్లెల గోపీచంద్ అమ్మమ్మ గోరంట్ల ఆదెమ్మ (89) మృతి చెందారు. ఇంకొల్లు మండలం నాగండ్ల గ్రామానికి చెందిన ఆదెమ్మ కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాద్‌లో చికిత్స పొందుతూ సోమవారం ఉదయం మృతి చెందినట్లు కుటుంబీకులు తెలిపారు. ఆమెకు ఇద్దరు కుమార్తెలు కాగా పెద్దకుమార్తె సుబ్బాయమ్మ కుమారుడు పుల్లెల గోపిచంద్. అమ్మమ్మ మృతి చెందడంతో సోమవారం నాగండ్లలో జరిగిన అంత్యక్రియల కార్యక్రమంలో గోపీచంద్ పాల్గొన్నారు. ఆదెమ్మ మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఉమ్మడి రాష్ట్రాల బ్యాడ్మింటన్ అసోసియేషన్‌ల తరుపున సంతాపం తెలిపారు. ఆదెమ్మ నివాళులర్పించినవారిలో కరణం చెంచుపున్నయ్య, రావి సత్యనారాయణ, సోమేపల్లి రామ్మోహనరావు, మార్కెండెయులు, గోరంట్ల హరిబాబు, బాబు, శ్రీనివాసరావు, కుమార్, పీవీలక్ష్మీ ఉన్నారు.



ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో సాగు చేసిన పండ్ల తోటలను పరిశీలిస్తున్న అధికారులు

ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన

బల్లికురవ, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : రసాయనిక ఎరువుల వాడకాన్ని తగ్గించి ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో పంటలు సాగు చేసేలా రైతులకు అవగాహన కల్పించాలని జోయిన్ కూప్ ప్రతినిధి (జర్మనీ) ప్రతిమ కోరారు. సోమవారం ప్రకృతి వ్యవసాయ విభాగం రైతు సాధికారిక సంస్థ తరపున మండలంలోని నక్కబొక్కలపాడు, బల్లికురవ, చెన్నుపల్లిలో స్వయం సహాయక సంఘ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా రైతులకు ప్రకృతి వ్యవసాయ చేయడం వల్ల ఎదురవుతున్న సమస్యల గురించి వారిని అడిగి తెలుసుకున్నారు. తక్కువ ఖర్చుతో అధిక లాభాలు రావాలంటే రైతులు గ్రామాలలో అందుబాటులో ఉండే కషాయాల ద్వారా పంటలను సాగు చేసుకోవాలని సూచించారు. అనంతరం బల్లికురవ గ్రామంలో పావులూరి దానారావు అనే రైతు ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో సాగు చేసిన పండ్ల తోటలను పరిశీలించి ఆయన్ని అభినందించారు. చెన్నుపల్లిలో మువ్వా ఆంజనేయులు, ఈమని నాగరాజులు సాగు చేస్తున్న పంటలను పరిశీలించారు. పురుగు మందు అవశేషాలు లేని పంటలను సాగు చేసుకుని పంట ఉత్పత్తులను వాడితే ఆరోగ్యవంతులుగా జీవించవచ్చని ఈ సందర్భంగా తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ప్రకృతి విభాగం ప్రాజెక్టు మేనేజర్ వాణిశ్రీ, రైతు సాధికార సంస్థ రాష్ట్ర ప్రతినిధి సౌమ్య, అడిషనల్ డీపీఎం మోహన్, ఎన్ఎఫ్‌ఏ చందనదుర్గ, ట్రైనర్ అప్పారావు, యూనిట్ ఇన్‌చార్జి సీహెచ్ కల్పన, నాగాంజలి, నాగరాజు పాల్గొన్నారు.

పోషకలోపంతో రాలుతున్న మామిడి పిందె



మామిడి పెంపకంపై రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

వేటపాలెం(చీరాల), మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : మామిడిలో పోషకలోపంతో పిందె రాలుతుందని, దానిని నివారించడానికి కచ్చితంగా ప్రాధాన్యత కలిగిన పిచికారీ చేయాలని గుంటూరు కీటక శాస్త్రవేత్త నాగేంద్రరెడ్డి, డీహెచ్‌వో జెన్నమ్మ అన్నారు. సోమవారం పందిళ్లపల్లి రామన్నపేటలో గల మామిడి తోటలను వారు పరిశీలించారు. ఈసందర్భంగా తేనె మంచు పురుగులు ఉన్నట్లు గుర్తించారు. పంటను దెబ్బతీసే పురుగు చేరుతున్నట్లు రైతులకు వివరించారు. పూతను ఆసించే గొంగళి పురుగులు, ఆకుతినే పురుగుల ఉధృతి లేకుండా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారి కాశీవిశ్వనాథ్, హెచ్‌వో అలేఖ్య, రైతులు పాల్గొన్నారు.

అర్హులైన నిరుపేదలకు స్థలాలు కేటాయించాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న ప్రతినిధులు

చీరాల, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : అర్హులైన నిరుపేదలకు నివేశన స్థలాలు కేటాయించాలని దళిత బహుజన పార్టీ జిల్లా అధ్యక్షుడు షేక్ జిలానీ అన్నారు. సోమవారం తహసీల్దార్ గోపీకృష్ణకు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ మండల పరిధిలో అధిక శాతం మంది సొంత ఇళ్లు లేక అద్దె నివాసాల్లో మగ్గుతున్నట్లు వివరించారు. ఈక్రమంలో సామాన్యులకు స్థలాలు కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో పలువురు ప్రతినిధులు పాల్గొన్నారు.

సావిత్రీబాయి పూలేకు నివాళి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న ప్రతినిధులు

అద్దంకిటౌన్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): ఆడపిల్లలను బడిలోకి అనుమతించని రోజులలో సావిత్రీబాయి పూలే ఇంటిలోనే చదువుకొని ఇతర బాలికలకు చదువు చేప్పే ఉపాధ్యాయినిగా ఎదిగారని ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు జ్యోతి రమేష్‌బాబు అన్నారు. సోమవారం సావిత్రీబాయి పూలే వర్ధంతి కార్యక్రమాన్ని స్థానిక చైతన్య బధిరుల ఆశ్రమ పాఠశాలలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా సావిత్రీబాయి చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ప్రతి విద్యార్థినీ సావిత్రిబాయిని ఆదర్శంగా తీసుకుని ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో నక్కా కాంతారావు, చెన్నుపల్లి నాగేశ్వరరావు, జ్యోతి చంద్రమౌళి, రామాంజనేయులు, కోటేశ్వరరావు, సుబ్బారావు, పాఠశాల నిర్వాహకురాలు పూనూరి ఆరోగ్యం, ప్రిన్సిపాల్ సురేంద్రబాబు, విద్యార్థులు పాల్గొన్నారు. విద్యార్థులకు స్వీట్లు, పండ్లను పంపిణీ చేశారు.

బీసీ, ఈబీసీ రుణాలకు దరఖాస్తులు చేయాలి

అద్దంకిటౌన్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గ్రామాల్లో అర్హులైన బీసీ, ఈబీసీ వర్గాలకు చెందిన వారు కార్పొరేషన్‌ల సబ్సిడీ రుణాల కోసం ఈనెల 22వ తేదీలోపు దరకాస్తులు చేసుకోవాలని ఎంపీడీవో బత్తిని సింగయ్య సోమవారం ప్రకటన తెలిపారు. వివరాలకు సచివాలయంలోని వెల్ఫేర్ అసిస్టెంట్‌లను సంప్రదించాలని సూచించారు.

మరింత తగ్గిన చికెన్ ధరలు

అమ్మకాలు పెంచుకునేందుకు వ్యాపారుల ప్రయత్నాలు



అద్దంకిలో చికెన్ దుకాణాల వద్ద కిలో రూ.100గా ఏర్పాటు చేసిన బోర్డులు

అద్దంకి, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : అద్దంకిలో చికెన్ ధరలు మరింత తగ్గాయి. ధరలు తగ్గడం ఒక కారణం అయితే చికెన్ ప్రియులను ఆకర్షించేందుకు వ్యాపారులు మరింత ధర తగ్గించి అమ్మకాలు చేస్తున్నారు. రెండు నెలల కిందట రూ.200పైనే ఉన్న చికెన్ ధర బర్డ్‌ఫ్లూతో కోళ్ల మృతి చెందుతుండడంతో చికెన్ అమ్మకాలు ఒక్కసారిగా తగ్గిపోయాయి. దీంతో ధరలు ఒక్కసారిగా తగ్గిపోయాయి. గత వారం పది రోజులుగా కిలో రూ.100కే అమ్మకాలు చేస్తున్నారు. సాధారణంగా పట్టణంలో ప్రతి ఆదివారం 50 క్వింటాళ్ల చికెన్ అమ్మకాలు జరుగుతాయి. ఒక్క సారిగా పదో వంతు అమ్మకాలకు పడిపోయాయి. ఈ నేపథ్యంలో తగ్గిన చికెన్ ధరలకు తోడు స్థానిక వ్యాపారులు మరి కొంత ధర తగ్గించి అమ్మకాలను ప్రారంభించారు. దీంతో చికెన్ అమ్మకాలు మళ్లీ పుంజుకుంటున్నాయి. ప్రస్తుతం 20 క్వింటాళ్ల చికెన్ అమ్మకాలు జరుగుతున్నాయి.

ధర తక్కువ ఉండడంతో తిరిగి అమ్మకాలు మొదలు



బర్డ్‌ఫ్లూతో చికెన్ అమ్మకాలు భారీగా తగ్గిపోయాయి. రోజుకు ఇద్దరు, ముగ్గురు కూడా కొనుగోళ్లు చేయని పరిస్థితి. ప్రస్తుతం కిలో చికెన్ రూ.100 కావడంతో ఇప్పుడిప్పుడే కొనుగోలుకు ముందుకు వస్తున్నారు. గతంలో ప్రతి ఆదివారం అద్దంకి పట్టణంలో 50 క్వింటాళ్ల చికెన్ అమ్మకాలు జరిగేవి. ప్రస్తుతం 20 క్వింటాళ్ల అమ్మకాలు జరుగుతున్నాయి. అమ్మకాలు సాధారణ స్థాయికి చేరడానికి కొంత సమయం పట్టే అవకాశం ఉంది.

- యేజెండ్ల బాబు, చికెన్ దుకాణ యజమాని, అద్దంకి



చెత్త కుప్పలో వృథాగా ఉన్న చెత్త సేకరణ రిక్షా

చెత్తకుప్పలో చెత్తబండి

వేటపాలెం (చీరాల), మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : గ్రామీణ ప్రాంతాల్లో పారిశుధ్య నిర్వహణపై అధికారులు ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. ఎక్కడా కూడా చెత్త సేకరణలో సిబ్బంది నిర్లక్ష్యం వహించరాదని సూచిస్తున్నారు. ప్రభుత్వ ఆస్తులు, వస్తువుల జాగ్రత్తలపై ప్రత్యేక సూచనలు చేస్తున్నారు. అయితే వేటపాలెం మండలం రామన్నపేట పంచాయతీలో అందుకు భిన్నంగా పరిస్థితులు కనిపిస్తున్నాయి. చెత్త సేకరణలో చిత్తశుద్ధి లేదని ప్రజలు అంటున్నారు. ప్రధాన మార్గాల్లో తప్ప అంతర్గత రహదారుల్లో విధిగా చెత్త సేకరణ జరగడం లేదని విమర్శిస్తున్నారు. పైగా పంచాయతీల్లో సిబ్బంది కొరత, నిధులు కొరత వేధిస్తుంటే రామన్నపేటలో చెత్త సేకరించే రిక్షాను ఏకంగా చెత్త కుప్పలకే పరిమితం చేసి తమ నిర్లక్ష్యాన్ని ప్రదర్శించారు. దీంతో వాహనం వారాల తరబడి మూలనపడి శిథిలమవుతుంది. దీనిపై అధికారులు స్పందించి ప్రభుత్వ ఆస్తులు, వస్తువులపై జాగ్రత్తలు పాటించాలని ప్రజలు కోరుతున్నారు.

నమ్మించి మోసం చేసిన వ్యక్తిపై కేసు

విద్యాధరపురం, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): డబ్బులు పెట్టుబడి పెడితే పొలం కొనుగోలు చేసి వచ్చిన లాభాలలో ప్లాట్లు ఇస్తానని మోసం చేసిన వ్యక్తిపై సోమవారం భవానీపురం పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. భవానీపురం గుడివాడ రామారావు వీధిలోని శ్రీరామకస్తూరిబాయి అపార్టుమెంట్‌లో శ్యామల కోటేశ్వరి అలియాస్ రెడ్డమ్మ (54)కుటుంబ సభ్యులతో నివాసం ఉంటున్నారు. ప్రకాశం జిల్లా అద్దంకి సమీపంలోని కుర్రవానిపాలెం ప్రాంతానికి చెందిన కాకాని రాధాకృష్ణమూర్తితో ఐదేళ్లను నుంచి పరిచయం ఉండటంతో అతను అద్దంకి సమీపంలోని మోదేపల్లి గ్రామంలో 9 ఎకరాల భూమిని కొనుగోలు చేస్తున్నానని, డబ్బులు పెట్టుబడి పెడితే దానిని అభివృద్ధి చేసి ప్లాట్ల రూపంలో 20సెంట్లు చొప్పున రిజిస్ట్రేషన్ చేస్తానని రెడ్డమ్మను నమ్మించాడు. అతని మాటలు నమ్మిన కోటేశ్వరి అయిదేళ్లుగా మొత్తం రూ.36 లక్షలు, స్థలం డెవలప్‌మెంట్ కోసం మంటూ మరో రూ.8లక్షలు అతనికి ఇచ్చింది. ఆ తరువాత ప్లాట్లు తన పేరుతో రిజిస్ట్రేషన్ చేయమని బాధితురాలు కోరింది. అందుకు రాధాకృష్ణమూర్తి ఆమెను అసభ్యకరంగా దూషించి, దాడి చేయడమే కాక, చంపుతానని బెదిరించాడు. దీంతో ఆమె పోలీసులకు ఫిర్యాదు చేస్తాననడంతో రెండు వారాలు గడువు కోరాడు. ఆ తరువాత నుంచి రాధాకృష్ణమూర్తికి ఫోన్ చేసినా స్పందించటం లేదు. దీంతో బాధితురాలు పోలీసులను ఆశ్రయించడంతో పోలీసులు రాధాకృష్ణమూర్తిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కృష్ణా డెల్టాకు మళ్లీ మహర్దశ !

(5వ పేజీ తరువాయి)

పరిష్కారాన్ని చూపే దిశగా కూటమి ప్రభుత్వం తొలి అడుగు వేసింది. ఆధునికీకరణ పనులు దశాబ్దాలుగా ప్రతిపాదనలకే పరిమితమయిన తరుణంలో ఏకంగా డ్రెయిన్ వెడల్పు చేయటం కీలకం కావటంతో, ఆ పనులను చేయాలని నిర్ణయించటంతో ఇక్కడి రైతుల్లో హర్షం వ్యక్తం అవుతోంది. పొన్నూరు, బాపట్ల, పెదనందిపాడు, కాకుమాను, పర్చూరు మండలాల పరిధిలో ఉన్న ఈ డ్రెయిన్ సమస్య ఇప్పటి కాదు. దీనిపై 1964 నుంచి ప్రభుత్వాలు కమిటీలు వేస్తూనే వచ్చాయి. అప్పటి మిత్ర కమిటీ దగ్గర నుంచి 2006 వరకు సాగిన నిపుణుల కమిటీలు అనేక సూచనలు చేస్తే, వాటిని ఇప్పటి వరకు బుట్టదాఖలు చేస్తూ వచ్చారు. అయితే తాజాగా కూటమి ప్రభుత్వం అప్పటి మిత్ర కమిటీ నుంచి తాజా కమిటీలు చూపిన వాటిలో ప్రధానమైన ఆధునికీకరణ పనులకే ప్రాధాన్యం ఇచ్చారు. దీనికి రూ. 480 కోట్లు ఖర్చవుతున్నప్పటికీ వాటిని పూర్తిచేయాలనే నిర్ణయానికి రావటంతో, ప్రతిపాదనలుకూడా ప్రభుత్వానికి నీటిపారుదల శాఖ పంపింది. నల్లమడ డ్రెయిన్ ఇప్పటి వరకు 300 సీ (కోఎఫిషియంట్ అఫ్ డిశ్చార్జ్) వ్యాల్యూ ప్రకారం ఉంది. అయితే దీనిని 500 సీ వాల్యూ ప్రకారం వెడల్పు చెయ్యాలి. దీనికోసం అదనంగా భూమినికూడా సేకరించాల్సి ఉంటుంది. ఈ రూ. 480 కోట్లలో రూ. 300 కోట్లు డ్రెయిన్ ఆధునికీకరణ పనులకు కేటాయిస్తే, మిగిలిన రూ. 180 కోట్లు భూ సేకరణ కోసం కేటాయించారు. ఈ 500 సీ వాల్యూ ప్రకారం డ్రెయిన్ వెడల్పు జరిగితే పంట ముంపునకు గురవకుండా చేతికి అందుతుంది. ఈ పనులను గత చంద్రబాబు ప్రభుత్వం ఉన్నప్పుడు 2016లోనే చెయ్యాలని నిర్ణయించారు. అయితే అప్పట్లో నిధులు మంజూరు చేయటం, టెండర్లు పిలవటం వరకు జరిగినా, పనులు మాత్రం మొదలు కాలేదు. తర్వాత వచ్చిన ప్రభుత్వం అసలు దీనిని పక్కన పెట్టేసింది. దీంతో రైలకు కష్టాలు మరింత పెరిగాయి. అయితే మళ్లీ కూటమి సర్కారు వచ్చాక ఈ పనుల్లో కదలిక రావటంతో రైతులు ఊపిరి పీల్చుకుంటున్నారు.



బీఎం డ్రెయిన్ కట్టలు జారిపోవడంతో పాడైన మట్టి మూటలు

మళ్లీ డెల్టా ఆధునికీకరణకు శ్రీకారం

కృష్ణా డెల్టా ఆధునికీకరణకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. 2007లో ఆధునికీకరణ జరగటం మినహా తర్వాత వీటిపై పెద్దగా పనులేవీ జరిగిన దాఖలాలు లేవు. దీంతో డెల్టాలోని కాల్వలన్నీ శిథిల స్థితికి చేరిపోయాయి. ఈ తరుణంలో ఆధునికీకరణ ఒక్కటే మార్గం కావటంతో దీనికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇచ్చింది. దీనికోసం ప్రతిపాదనలు పంపాలను నీటిపారుదల శాఖకు ఆదేశాలు పంపింది. ఈ మేరకు అంచనాలు రూపొందించే పనిలో నీటిపారుదల శాఖ ఉంది. గతంలో డెల్టా కాల్వల ఆధునికీకరణ రూ. 1024 కోట్లు కేటాయించారు. అయితే వీటిలో 60 శాతం నిధులే సద్వినియోగం అయ్యాయి. రూ. 408 కోట్ల విలువైన కొమ్మమూరు కాల్వ పనులు మాత్రం ఒక్కటి కూడా జరగలేదు. దీంతో ఈ కాల్వపై సాగునీటి కష్టాలు మరింత పెరిగిపోయాయి. నీరు పుష్కలంగా ఉన్నప్పుడు కట్టలకు గండ్లు పడుతున్న పరిస్థితి కూడా ఉంది. అయితే ఆధునికీకరణ చేస్తే ఈ కాల్వ కిందున్న రైతులకు కష్టాలు తీరినట్టే. అయితే ఈసారి ఆధునికీరణ చేపట్టాలంటే కనీసం రూ. 1500 కోట్ల వరకు ఖర్చవుతుందని నీటిపారుదల శాఖ అంచనా వేస్తోంది. అయితే అంత మొత్తం ఇప్పుడున్న పరిస్థితుల్లో మంజూరవుతుందా! లేక కుదింపు వంటి కార్యక్రమం ఉంటుందా అనే అనుమానాలు కూడా ఉన్నాయి. ఏదిఏమైనా దీనికి సంబంధించిన డిటైల్డ్ ఎస్టిమేషన్స్ పూర్తి కావాలంటే కనీసం మూడు ఖరీఫ్ సీజన్‌లు పడుతుందని అధికారులు చెబుతున్నారు. ప్రతి కాల్వపైనా క్షుణ్ణంగా పరిశీలించి, బ్రాంచి కాల్వలతో సహా అన్ని పనులను గుర్తించాల్సి ఉంటుంది. అయితే ఈ తరుణంలో నీటి సంఘాల పాత్ర కూడా కీలకం కానుంది. ఈ మూడేళ్లలో ప్రతిపాదనలు సిద్ధం చేస్తే, నిధుల మంజూరు ప్రక్రియ కీలకం అవుతుంది. ఈ విషయంలో కూటమి ప్రభుత్వం ఏవిధంగా ముందుకు వెళుతుందనేది చూడాల్సిందే.



పెదనందిపాడు మండలంలో నల్లమడ డ్రెయిన్ కట్టకు గండ్లు పడడంతో నీట మునిగిన పంట పొలాలు (ఫైల్)

ఆరంభం అదుర్స్

- కిలో రూ.280 పలికిన ప్రారంభ ధర
- బోర్డు చరిత్రలో ఇదే అత్యధికం
- దక్షిణాదిలో ప్రారంభమైన ప్రస్తుత సీజన్ పొగాకు కొనుగోళ్లు

ఒంగోలు, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): పొగాకు మార్కెట్ ఆరంభం అదిరిపోయింది. కొనుగోళ్ల ప్రారంభం రోజున కిలో రూ.280 గరిష్ఠ ధర పలికింది. గత ఏడాది వేలం ప్రారంభం రోజున కిలో రూ.230 ఇచ్చిన వ్యాపారులు ఈ ఏడాది ఎవరి ఊహలకు అందని విధంగా ఏకంగా రూ 280 ఇచ్చారు. అలా గత ఏడాది కన్నా ఈ ఏడాది ఏకంగా ప్రారంభ ధర కిలోకు రూ.50 పెంచి ఇవ్వగా పొగాకు బోర్డు చరిత్రలో కొనుగోళ్ల ప్రారంభం రోజున లభించిన గరిష్ఠ ధర ఇదే. రాష్ట్రంలో 16 వేలం కేంద్రాలలో ప్రస్తుత సీజన్ పొగాకు కొనుగోళ్లను మూడు విడతలలో చేపట్టాలని పొగాకు బోర్డు నిర్ణయించింది. అందులో దక్షిణాది ప్రాంతంగా పిలిచే మన జిల్లా, నెల్లూరు జిల్లాలో ఉన్న 11 కేంద్రాలలో తొలుత నాలుగు చోట్ల, రెండవ దశలో మిగిలిన ఏడు చోట్ల వేలం ప్రారంభానికి నిర్ణయించారు. తదనుగుణంగా సోమవారం దక్షిణాదిలో తొలిదశ పొగాకు కొనుగోళ్లు ప్రారంభమయ్యాయి.

కొండపిలో ప్రారంభించిన చైర్మన్

జిల్లాలోని ఒంగోలు-1, కొండపి, పొదిలి కేంద్రాలతో పాటు నెల్లూరు జిల్లాలోని కందుకూరు-1 కేంద్రంలో వేలం ప్రక్రియ ప్రారంభమైంది. కొండపి కేంద్రంలో పొగాకు బోర్డు చైర్మన్ చిడిపోతు యశ్వంత్‌కుమార్ ప్రారంభించగా ఒంగోలు-1 కేంద్రంలో బోర్డు ఈడీ అద్దంకి శ్రీధర్‌బాబు ప్రారంభించారు. కొండపిలో చైర్మన్‌తోపాటు బోర్డు వైస్ చైర్మన్ బొడ్డపాటి బ్రహ్మయ్య స్థానిక అధికారులు హాజరు కాగా ఒంగోలు-1లో ఆర్ఎం లక్ష్మణరావు ఇతర అధికారులు, రైతు నాయకులు ఉన్నారు. అలాగే పొదిలి, కందుకూరు-1లలో అక్కడి పొగాకు వేలం అధికారులు, స్థానిక రైతు, వ్యాపార ప్రతినిధుల సమక్షంలో వేలం ప్రారంభించారు. అన్నిచోట్ల తొలిరోజున 18 బేళ్ల వంతున వేలంకు తీసుకురాగా అన్నింటిని వ్యాపారులు కొన్నారు. నాలుగు కేంద్రాల్లోను గరిష్ఠ ధర కిలో రూ.280 లభించింది.

అయోమయంలో నల్లబర్లీ రైతులు

- భారీగా పెరిగిన సాగు
- ఇళ్లు, పొలాల వద్ద పేరుకున్న మండెలు
- కొనుగోలు ప్రారంభించని కంపెనీలు
- అమ్మకానికి నోచుకోకపోవడంతో ఆందోళన



పంగులూరులో షామియానాల కింద మండెగా వేస్తున్న ఎండిన నల్లబర్లీ పొగాకు.. కొనుగోలు ప్రారంభంకాక పరదాల మాటున ఉన్న పొగాకు మండెలు.. రేకుల షెడ్డులో గుట్టగా పడేసిఉన్న ఎండిన బర్లీ పొగాకు తాళ్లు

పంగులూరు, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : బర్లీ పొగాకు సాగు రైతుల పరిస్థితి దయనీయంగా ఉంది. రైతులు ఇబ్బడిముబ్బడిగా బర్లీ పొగాకు సాగును చేపట్టినప్పటికీ పొగాకు కంపెనీలు కొనుగోళ్లు నేటికీ ప్రారంభం కాకపోవడంతో దిక్కుతోచనిస్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. గత ఏడాది 1500 ఎకరాల్లో బర్లీ పొగాకును సాగుచేయగా, ఈ ఏడాది సుమారు 5 నుంచి 6వేల ఎకరాల్లో సాగు చేశారు. ప్రస్తుతం మంచి దిగుబడితో చేతికి అందివచ్చిన పొగాకును ఎక్కడ నిల్వ చేయాలో అర్థంకాక అవస్థలు పడుతున్నారు. పెరిగిన పొగ తోటలో అందివచ్చి వొలిచిన ఆకును ఎండబెట్టిన కొద్ది సమయానికే కొనుగోలు ప్రారంభం అవుతాయని, అమ్ముకున్న సొమ్ము పెట్టుబడికి ఆసరాగా ఉపయోగ పడుతుందని ఆశించినా అవి ఆవిరవుతున్నాయి. చేతికి అందివచ్చిన పొగాకు దిగుబడులను నిల్వ చేసే వీలు లేక షామియానాల కింద, ఖాళీ స్థలాలు, పొలాల్లో మండెలు వేసి కాపలా కాస్తున్నారు. కంపెనీలు ఎప్పుడు కొనుగోలు చేస్తాయో తెలియక, ఎంత ధర వస్తుందోనని తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు.

ఇబ్బడిముబ్బడిగా పెరిగిన సాగు విస్తీర్ణం

గత ఏడాది బర్లీ సాగు లాభదాయకంగా ఉండటం, మిరపకు వస్తున్న తెగుళ్లతో పతనమైన మిరప ధరలతో అధికంగా నష్టపోయిన రైతులు ఈ ఏడాది సుమారు 6వేల ఎకరాల్లో నల్ల బర్లీ సాగును చేపట్టారు. ఎకరాకు 30 నుంచి 35 వేల కౌలు చెల్లించి చేపట్టారు. గత ఏడాది నల్ల బర్లీకి, తెల్ల బర్లీకీ ధరలలో పెద్ద వ్యత్యాసం లేకపోవడంతో అధిక దిగుబడితో పాటు సాగు తేలికగా ఉంటుందన్న ఆశతో ఎక్కువ మంది రైతులు నల్లబర్లీని సాగు చేశారు. అన్ని ప్రాంతాలలో విపరీతంగా పెరిగిన నల్లబర్లీ సాగుతో రైతులకు తీరని కష్టాలొచ్చాయి. నాటు వేసే సమయంలో ఆకాశాన్నంటిన నారు ధరలు, నాటు కూలీ, పైరు పెరిగే దశలో కురిసిన వర్షాలతో సతమతమయిన రైతులు ఆకు వొలిచే సమయానికి ఏర్పడిన కూలీల కొరత, పెరిగిన కూలి రేట్లు రైతులను కుంగదీశాయి. అష్టకష్టాలు పడి పండించిన పొగాకు కొనుగోలుకు నోచుకోక పోవ నిల్వఉంచేందుకు అనువైన స్థలాలు లేక, మండెల వద్ద కాపలాకాయలేక సతమతమవుతున్నారు.

కంపెనీల కొర్రీలతో తెల్లబర్లీ అమ్మకాల్లో ఇబ్బందులు

గత ఏడాది దొరికిన ప్రతి పొగాకు చెక్కును వెంటబడి కొన్న కంపెనీలు ఈ ఏడాది మార్కెట్లో పుష్కలంగా సరుకు ఉండడంతో తమకు మేలిమి బంగారం కావాలంటూ రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నారు. తెల్ల బర్లీ కొనుగోళ్లు జరుగుతున్న తీరు ఇందుకు అద్దం పడుతుంది. ఆరుగాలం కష్టపడి పండించిన తెల్లబర్లీ పొగాకు చెక్కులు అమ్మకానికి పెడితే మచ్చ ఉందని, రంగు ఆశాజనకంగా లేదని, తేమ శాతం పేరుతో విధిస్తున్న ధరల కోత, వెనుకకు పంపుతున్న పొగాకు బేళ్లతో రైతులు కుంగిపోతున్నారు. మార్కెట్ మాయాజాలంలో తెల్లబర్లీ రైతులు అవస్థలు పడుతుంటే, నల్లబర్లీ కొనుగోళ్ల ఊసే లేని పరిస్థితితో రైతులు కంటతడి పెడుతున్నారు. కంపెనీలు కొనుగోళ్లు ప్రారంభించేలా ప్రభుత్వం తగు చర్యలు చేపట్టి తమను ఆదుకోవాలని బర్లీ రైతులు వేడుకుంటున్నారు.

వెంటనే కొనుగోలు చేయాలి



ఈ ఏడాది ఎకరాకు లక్షన్నర వరకూ పెట్టిబడి పెట్టి నల్లబర్లీ పొగాకును సాగు చేశాం. కవులు, ఖర్చులు పెరిగాయి. సుమారు రూ.లక్షన్నర వరకూ పెట్టుబడి ఖర్చులు అయ్యాయి. కనీస ధర రూ.12వేల నుంచి రూ.15వేలు చెల్లించాలి. వెంటనే కంపెనీల వారు వచ్చి కొనుగోలు చేయాలి. లేకుంటే రైతులు తీవ్రంగా నష్టపోతారు. గత ఏడాది ఈ సమయానికి కొనుగోళ్లు పూర్తయ్యాయి. మంచి లాభాలను కూడా చూశాం.

- అడ్డగడ సతీష్, రైతు, చందలూరు

కంపెనీలు రంగంలోకి దిగాలి



పొగాకు కంపెనీలు పొగాకు సాగు చేయాలని రైతులను ప్రోత్సహించాయి. ఈ మేరకు మండలంలో సుమారు 5 నుంచి 6వేల ఎకరాల్లో బర్లీ పొగాకును సాగు చేశారు. ఏవైతే కంపెనీలు చెప్పాయో ఆ ప్రతినిధులు వెంటనే రంగంలోకి వచ్చి రైతుల వద్ద ఉన్న పొగాకు ఉత్పత్తులను కొనుగోలు చేయాలి. ఈ విషయంలో జాప్యం జరిగితే రైతులు నష్టపోతారు.

- డీ.సుబ్బారెడ్డి, వ్యవసాయాధికారి



కార్యాలయంలో పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంపీడీవో స్వరూపారాణి

పీ-4 సర్వేకు సహకరించాలి

పంగులూరు, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం స్వర్ణాంధ్ర - 2047లో భాగంగా ప్రతి ఇంటికీ అభివృద్ధి, ప్రతి జీవితానికి ప్రగతి అనే నినాదంతో నిర్వహిస్తున్న పీ-4 సర్వేకు ప్రజలు సహకరించాలని ఎంపీడీవో స్వరూపారాణి కోరారు. ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం పీ4 సర్వేకు సంబంధించి ప్రభుత్వం విడుదల చేసిన పోస్టర్‌ను ఎంపీడీవో ఆవిష్కరించారు. పేదల ప్రగతికి పరస్పర సహకారంతో ప్రభుత్వం, దాతలు, ప్రజల భాగస్వామ్యంతో చేపడుతున్న పీ-4 సర్వేపై ప్రజలు క్యూఆర్ కోడ్ ద్వారా అభిప్రాయాలను తెలియజేయాలని కోరారు. ఈ నెల25 వరకు చేపట్టే సర్వేను ప్రజలు వినియోగించుకోవాలని ఎంపీడీవో సూచించారు. కార్యక్రమంలో పీఆర్ ఏఈ హనుమంతరావు, ఈవోఆర్డీ సుమంత్, ఏవో సుబ్బారెడ్డి, కార్యాలయ సూపరింటెండెంట్ రమేష్, కార్యదర్శి రాంబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

పరిశీలించిన ఎంపీడీవో

చినగంజాం : మండల పరిధిలో జరుగుతున్న పబ్లిక్, ప్రైవేట్ పీపుల్ పార్టనర్ షిప్ (పీ-4) సర్వేని ఎంపీడీవో ఏ శ్రీనివాసమూర్తి సోమవారం పరిశీలించారు. పలు గ్రామాల్లో జరుగుతున్న పీ-4 సర్వేని ఆయన పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు అందజేశారు. సర్వేలోని ప్రశ్నలకు సంబంధించిన వివరాలను నమోదు చేయడంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పేదిరిక నిర్మూలన కోసం ప్రభుత్వం ఈ సర్వేని చేపట్టినట్లు తెలిపారు. ఈ సర్వే ద్వారా పేదకుటుంబాలను గుర్తించి వారి జీవనప్రమాణాలను మెరుగు పరచడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. గ్రామ సచివాలయ సిబ్బంది, గ్రామ కార్యదర్శులు, గ్రామ రెవెన్యూ అధికారులతో ఈ నెల 18వ తేదీ వరకు సర్వే నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో తెలిపారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శులు, వీఆర్వోలు, గ్రామ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ షార్టు సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం



ప్రమాదంలో పూర్తిగా కాలిపోయిన ఇల్లు

జరుబులవారిపాలెం(పర్చూరు), మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో రేకుల షెడ్‌తో ఉన్న ఇల్లు దగ్ధమైన ఘటన కారంచేడు మండల పరిధిలోని జరుబులవారిపాలెంలో ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన మహాలక్ష్మి ఇల్లు ప్రమాదంలో కాలిపోయింది. ఇంట్లో ఎవరూలేని సమయంలో అగ్నిప్రమాదం జరగడంతో పెనుప్రమాదం తప్పింది. సుమారు రూ.2లక్షలకు పైగా ఆస్తి నష్టం జరిగిందని బాధితురాలు ఆవేదన వ్యక్తం చేశారు. అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇచ్చినా సకాలంలో స్పందించకపోవడంతో తన ఇల్లు పూర్తిగా కాలిపోయిందని ఆమె విలపిస్తున్నారు. గ్రామస్థులు ట్యాంకర్ ద్వారా నీటిని తెచ్చి మంటలను అదుపుచేశారు.

ఆందోళనకు గురికాకుండా పరీక్షలు రాయండి

చీరాల, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు ఎలాంటి ఆందోళనకు గురికాకుండా పదో తరగతి పరీక్షలను రాయాలని కృతి ఫౌండేషన్ ఛైర్మన్ ఆకురాతి వెంకట అశ్విని, భట్టు ప్రదీప్ దంపతులు సూచించారు. ఏపీ మోడల్ స్కూల్ నుంచి పది పరీక్షలకు హాజరవుతున్న విద్యార్థులకు పరీక్ష పరికరాలను అందజేశారు. కార్యక్రమంలో స్కూల్ అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది, ఎస్ఎంసీ ప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ధర్నాను జయప్రదం చేయండి



మాట్లాడుతున్న ఇన్‌చార్జి చైర్మన్ జైసన్‌బాబు, నాయకులు

చీరాల, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం పరిపాలన విఫలమైందని ఇచ్చిన హామీలు విస్మరించి ప్రజలను మభ్య పెడుతున్నారని మునిసిపల్ ఇన్‌చార్జి చైర్మన్ బొనిగల జైసన్‌బాబు అన్నారు. సోమవారం చైర్మన్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వ తీరును నిరసిస్తూ ఈనెల 12వ తేదీన జిల్లా కలెక్టరేట్ వద్ద నిర్వహించే ధర్నా కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. నాయకులు యాతం మేరిబాబు, ప్రసాద్, రమణారెడ్డి, చిరంజీవి, వాసు పాల్గొన్నారు.

ఇంకొల్లు, : విద్యార్థులకు, నిరుద్యోగ యువతకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలని ఈ నెల 12న తలపెట్టిన యువతపోరు కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని వైసీపీ ఇన్‌చార్జి గాదె మధుసూదనరెడ్డి కోరారు. సోమవారం మండలంలోని పావులూరులో పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

స్కూటీని ఢీకొన్న కంటైనర్ లారీ

పాస్టర్ మృతి



బాలసుందరం మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్సై రవితేజ

అద్దంకి, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : స్కూటీని పక్కగా వెళ్తున్న కంటైనర్ లారీ ఢీకొనడంతో పాస్టర్ అత్తోటి బాలసుందరం (72) అక్కడికక్కడే మృతి చెందారు. పోలీసుల కథనం మేరకు.. మండలంలోని కలవకూరు చెందిన బాలసుందరం సోమవారం సాయంత్రం స్కూటీపై వెళ్తుండగా అద్దంకి పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఆగి ఉన్న కారు పక్క గుండా వెళ్లే క్రమంలో వెనుక నుంచి వెళ్తున్న కంటైనర్ లారీ వెనుక భాగం స్కూటీని ఢీకొట్టింది. దీంతో బాలసుందరం అక్కడికక్కడే మృతి చెందారు. ఘటనాస్థలాన్ని ఎస్సై రవితేజ పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.



ఆర్వో ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న ఎన్ఆర్ఐ పవన్, ఎఫర్ట్ ప్రతినిధులు

పాఠశాల అభివృద్ధికి సహకారం అందిస్తాం

కొమ్మినేనివారిపాలెంలో ఆర్వోప్లాంట్‌ను ప్రారంభించిన ఎన్ఆర్ఐ

బల్లికురవ, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : తాను ఎంత ఉన్నత స్థానంలో ఉన్నా తనకు విద్యను అందించిన పాఠశాలను జీవితంలో మరిచిపోనని ఎన్ఆర్ఐ కరిశెట్టి పవన్ పేర్కొన్నారు. సోమవారం మండలంలోని కొమ్మినేనివారిపాలెం ఉన్నత పాఠశాలలో గ్రామానికి చెందిన ఎన్ఆర్ఐ పవన్, ఎఫర్టు సంస్థ ద్వారా సుమారు రూ.3లక్షలు ఖర్చు చేసి విద్యార్థుల కోసం మినరల్ ఆర్వో ప్లాంట్, లైబ్రరీని ఏర్పాటు చేసి వారి చేతుల మీదుగా ప్రారంభించారు. ఈసందర్భంగా జరిగిన సభకు ప్రధానోపాధ్యాయుడు పాలపర్తి రామాంజనేయులు అధ్యక్షత వహించారు. ఎన్ఆర్ఐ, పీజీఎస్ఎఫ్ ప్రతినిధి అయిన పవన్ మాట్లాడుతూ తన జీతంలో 30 శాతాన్ని పాఠశాలల అభివృద్ధికి ఖర్చు చేస్తానని హామీ ఇచ్చారు. గ్రామీణ ప్రాంతాలలో ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసేందుకు తనవంతు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో ఎఫర్టు ప్రతినిధులు మురళీకృష్ణ, లక్ష్మయ్య, ఎంపీటీసీ సభ్యుడు మిన్నెకంటి రామారావు, టీడీపీ గ్రామ నాయకులు ఏల్చూరి శ్రీనివాసరావు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

యూత్ ఫెస్టివల్ పోటీల్లో సెయింట్ ఆన్స్ ప్రతిభ



విద్యార్థులతో కళాశాల ప్రతినిధులు

చీరాల, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : జాతీయస్థాయి యూత్ ఫెస్టివల్ వాలీబాల్ పోటీల్లో చీరాల సెయింట్ ఆన్స్ కాలేజీ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచి విన్నర్స్‌గా నిలిచారు. ఈనేపథ్యంలో సోమవారం కళాశాల ప్రాంగణంలో విజేతలను సెక్రటరీ వనమా రామకృష్ణారావు, కరస్పాండెంట్ శ్రీమంతుల లక్ష్మణరావు ప్రత్యేకంగా అభినందించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ గుంటూరు ఎన్ఆర్ఐ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ వారు ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో 26 జట్లు పాల్గొనగా ఉన్నతంగా రాణించి విజేతలుగా నిలువడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డా.జగదీష్, వ్యాయామ ఉపాధ్యాయుడు అన్నం శ్రీనివాసరావు క్రీడాకారులను అభినందించారు.

నేటి నుంచి దివ్యాంగులకు కంటి పరీక్షలు

చినగంజాం, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలో దృష్టి లోపంతో పెన్షన్లు పొందుతున్న దివ్యాంగులకు ఈ నెల 11, 12, 17వ తేదీల్లో చీరాల ఏరియా వైద్యశాలలో కంటి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో ఏ.శ్రీనివాసమూర్తి తెలిపారు. పెన్షన్ల రీ వెరిఫికేషన్‌లో భాగంగా దివ్యాంగులకు కంటి వైద్య పరీక్షలు జరుపుతున్నట్లు తెలిపారు. గతంలో వారు తీసుకున్న మెడికల్ సర్టిఫికెట్లను రీ వెర్ఫికేషన్ కోసం మరలా దివ్యాంగులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కంటి వైద్య పరీక్షలకు దివ్యాంగులు తప్పనిసరిగా హాజరు కావాలని ఎంపీడీవో తెలిపారు.

రామాపురంలో సమస్యలు పరిష్కరించాం

- అభివృద్ధికి సహకరించండి
- అసెంబ్లీలో ఎమ్మెల్యే కొండయ్య



అసెంబ్లీలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొండయ్య

చీరాల, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : గత వైసీపీ పాలకుల నిర్లక్ష్యం కారణంగా సముద్రతీరానికి వచ్చిన పర్యాటకులు తిరిగి వెళ్లే విషయమై ప్రశ్నార్థకమైన రోజులు ఎదురయ్యాయని, ఈనేపథ్యంలో పటిష్టమైన చర్యలు తీసుకుని సాధారణ పరిస్థితులను ఏర్పాటు చేశామని ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య అన్నారు. సోమవారం జరిగిన అసెంబ్లీ సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ రామాపురంలో ఇప్పటికే అనేక సమస్యలు పరిష్కరించామని వివరించారు. చీరాల నియోజకవర్గంలోని సహజసిద్ధమైన సముద్రతీరానికి పోలీస్ పర్యవేక్షణ కచ్చితంగా ఉందని, ప్రస్తుతం ఎక్కువ భాగంలో పర్యవేక్షణ చేస్తున్న ఈపూరుపాలెం పోలీస్ స్టేషన్ సిబ్బంది కొరత కారణంగా సామర్థ్యం సరిపోదని, సముద్రతీరానికి ప్రత్యేక పోలీస్ స్టేషన్‌ను ఏర్పాటు చేయాలని సభలో కోరారు. అలా గే తాగునీరు, విద్యుత్ సౌకర్యం కోసం సబ్‌స్టేషన్‌ను ఏర్పాటు చేయాలని కోరా రు. అంతేకాకుండా రామాపురం నుంచి సూర్యలంక వరకు కనెక్టివిటీ రోడ్డును ఏర్పాటు చేయడం వలన ఆదాయంతో పాటు ప్రజలకు సౌకర్యాలు సక్రమంగా అందుతాయని వివరించారు.

వేంకటేశ్వరస్వామి పాదాల నిర్మాణానికి భూమిపూజ

బల్లికురవ, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో వేంకటేశ్వర స్వామి పాదాలను ఏర్పాటు చేసేందుకు భక్తులు సమష్టి కృషితో ముందుకు వచ్చారు. సోమవారం పోలేరమ్మ దేవాలయం పక్కన నూతనంగా స్వామి పాదాలు, అరుగు నిర్మాణం చేపట్టేందుకు భూమి పూజ నిర్వహించారు. నెల రోజుల్లో పనులు పూర్తి చేయిస్తామని ఈసందర్భంగా భక్తులు తెలిపారు. కార్యక్రమంలో గ్రామానికి చెందిన భక్తులు పాల్గొన్నారు.

కాలువలో కరెంట్ పోల్

- నిర్మాణ పనుల్లో కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం
- పట్టించుకోని అధికారులు



ప్రాసంగులపాడు ఎస్సీ కాలనీలో స్తంభం ఉంచి కడుతున్న కాలువ

మేదరమెట్ల, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం, పంచాయతీలు లక్షలు వెచ్చించి గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పిస్తుంటే, కాంట్రాక్టర్‌లు మాత్రం అస్తవస్తంగా నిర్మాణ పనులు చేపడుతున్నారు. నాణ్యత లేకుండా కొత్త నిర్మాణాలు చేపట్టడంతోపాటు ప్రజలకు ఉపయోగం లేకుండా చేస్తున్నారు. మండలంలోని ప్రాసంగులపాడు ఎస్సీ కాలనీలో మురుగునీరు, వర్షపు నీరు పోయేందుకు కాలువలను నిర్మిస్తున్నారు. విద్యుత్ స్తంభాన్ని మధ్యలో పెట్టి కాలువను నిర్మిస్తున్నారు. ఇలా కరెంట్ పోల్ అడ్డంగా ఉంటే మురుగు ఎలా పారుతుందని ప్రజలు ముక్కునవేలేస్తున్నారు. పంచాయతీ కార్యదర్శి, ఇంజనీరింగ్ అసిస్టెంట్, సర్పంచ్, వార్డు మెంబర్లు కనీస పర్య వేక్షణ లేకపోవడంవల్లే కాంట్రాక్టర్‌లు నిర్లక్ష్యంగా కాలువను నిర్మిస్తున్నారని ఎస్సీకాలనీ వాసులు విమర్శిస్తున్నారు. ఇలా నిర్లక్ష్యంగా ఈ విధంగా విద్యుత్ స్తంభాలను కాలువ మధ్యలో పెట్టి నిరిశిస్తే మురుగునీరు ఎ లా పారుతుందని, ఎస్సీ కాలనీ వాసులు కాంట్రాక్టర్‌లను ప్రశ్నించిన స్పందన కరువైయింది. ఎస్సీ కాలనీలో ఇలా నాసిరకంగా కాలువలు నిర్మించడం వలన పంచాయతీ నిధులు దుర్వినియోగం కావడంతో పాటు కాలువలకు ఉపయోగం లేకుండా పోయింది. ఇప్పటికైనా మండల అధికారులు స్పందించి కాలువల నిర్మిణాన్ని పరిశీలించి తగు చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

ఘనంగా సంప్రోక్షణ పూజలు

చినగంజాం, మార్చి 10(ఆంధ్రజ్యోతి) : సీతారామాలయంలో ప్రాంగణ సంప్రోక్షణ పూజలను సోమవారం ఘనంగా నిర్వహించారు. వందేళ్ల నాటి సీతారామాలయం శిథిలావస్థకు చేరడంతో ఇటీవల ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్థులు ఆలయాన్ని తొలగించారు. నూతన ఆలయ నిర్మాణ కార్యక్రమంలో భాగంగా సంప్రోక్షణ పూజలు జరిపారు. ఆలయ అర్చకులు మోహనలక్ష్మీనరసింహాచార్యులు ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు వలివేటి రామానుజం, మోటుమర్రి రామసుబ్బారావు దంపతులచే శాస్త్రోక్తంగా సంప్రోక్షణ పూజలు చేశారు. అనంతరం గ్రామ పెద్దలు, మహిళా భక్తులు ఆలయ ప్రాంగణమంతా నవధాన్యాలను చల్లారు. ఆలయ ప్రాంగణంలోనే ఏప్రిల్ 6వ తేదీన శ్రీరామనవమి ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, మహిళా భక్తులు పాల్గొన్నారు.

రేపు స్వామివార్ల కల్యాణ మహోత్సవం

ఉప్పుటూరు (పర్చూరు), మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : ఉప్పుటూరు గ్రామంలోని శ్రీ గంగా పార్వతీ సమేత అమరేశ్వర స్వామి, శ్రీ భద్రకాళీ సమేత వీరభద్రేశ్వర స్వామి వార్ల కల్యాణ మహోత్సవం ఈనెల 12న జరుగుతుందని ఆలయ కార్యనిర్వహణాధికారి దామా నాగేశ్వరరావు సోమవారం ప్రకటనలో తెలిపారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివార్ల కల్యాణ వేడుకలను విజయవంతం చేయాలని కోరారు.

16న మాలల సాంస్కృతిక కళా జాతర



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న వెంకట్రావు తదితరులు

అద్దంకిటౌన్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : మార్చి 16న ఒంగోలులోని అంబేడ్కర్ కళా ఆడిటోరియంలో జరగనున్న మాలల సాంస్కృతిక కళా జాతరలకు నియోజకవర్గంలోని అందరు పాల్గొని జయప్రదం చేయాలని మాలల మహాసభ జాతీయ అధ్యక్షుడు మల్లెల వెంకట్రావు కోరారు. సోమవారం శింగరకొండలోని జై భీమ్ మాలల సత్రం ప్రాంగణంలో మాలల మహాసభను జయప్రదం చేయాలని కోరుతూ బాపట్ల జిల్లా అధ్యక్షుడు అంకం కిరణ్‌కుమార్ అ ధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్రంలో లక్ష మాల కుటుంబాలు కళలపై ఆధారపడి దుర్భర జీవితాలను గడుపుతున్నాయన్నారు. వీరికి నేటి వరకూ ప్రభుత్వాల నుంచి ఎటువంటి పెన్షన్స్, పక్కా గృహాలు, సంక్షేమ పథకాలు అందలేదన్నారు. కార్యక్రమంలో డాక్టర్ చప్పిడి వెంగళరావు, డి.కృష్ణ, కోండ్రు వీరాంజనేయులు, రాజశేఖర్, పూర్ణచంద్రరావు, అంకమ్మరావు, శ్రీనివాసరావు, శ్రీకృష్ణ, రవి, వికాస్, మరియదాసు పాల్గొన్నారు.

టిప్పర్‌ను ఢీకొన్న మరో టిప్పర్

అద్దంకి, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : ఆగి ఉన్న టిప్పర్‌ను వెనుక నుంచి మరో టిప్పర్ ఢీకొనడంతో డ్రైవర్‌కు పున్నయ్యకు గాయాలయ్యాయి. పట్టణంలోని నామ్ రోడ్డులో పాత పెట్రోల్ బంక్ సమీపంలో సోమవారం ఆగి ఉన్న టిప్పర్‌ను వెనుక నుంచి మరో టిప్పర్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో మార్టూరు మండలం తాటివారిపాలెంకు చెందిన టిప్పర్ డ్రైవర్ పున్నయ్యకు గాయాలు కావడంతో ఆసుపత్రిలో చేర్పించారు.

కార్యాలయ కౌంటర్‌లోనే పన్ను చెల్లించండి

సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడొద్దు

మున్సిపల్ కమిషనర్ రవీంద్ర

అద్దంకి, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : పన్నులు చెల్లింపు దారులకు పన్ను చెల్లించమని కమిషనర్ పేరుతో ఫోన్ చేసి ఫోన్‌పే చేయమని చెపితే ఎట్టి పరిస్థితులలో చెల్లింపులు చేయరాదని అద్దంకి మున్సిపల్ కమిషనర్ రవీంద్ర ఒక ప్రకటనలో తెలిపారు. ట్రేడ్ లైసెన్స్ చెల్లింపు దారులకు 7670906441 నెంబర్ నుంచి ఫోన్ చేసి మున్సిపల్ కమిషనర్‌గా చెప్పి ఆన్‌లైన్ పేమెంట్ చేయమని అడుగుతున్నట్లు పలువురు నుంచి ఫిర్యాదుల వచ్చాయని, ఆ ఫోన్‌నెంబర్ తనది కాదని కమిషనర్ వివరించారు. సచివాలయ సిబ్బంది, మున్సిపల్ సిబ్బంది మాత్రమే పట్టణంలో పన్నుల వసూలు చేస్తున్నారని తెలిపారు. ఫోన్‌పే, గూగుల్‌పే ద్వారా ఎట్టి పరిస్థితిలోనూ చెల్లింపుల చేయరాదన్నారు. మున్సిపల్ కార్యాలయంలో ఉన్న కౌంటర్‌లో ట్యాక్స్ చెల్లించి మోసాలకు గురి కాకుండా ఉండాలన్నారు.